శ్రీశైలానికి కొనసాగుతున్న వరద

శ్రీశైలం, ఆగస్టు 31: శ్రీశైలంలోని నీలం సంజీవరెడ్డి జలాశయానికి శనివారం వరద ప్రవాహం భారీగా కొనసాగింది. ఎగువ పరివాహక ప్రాంతాలు జూరాల నుంచి 3,53,823 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 912 క్యూసెక్కులు మొత్తం 3,54,735 క్యూసెక్కులు వరద వస్తోంది. డ్యాం అధికారులు 2 క్రస్టుగేట్లను 10 అడుగుల మేర, 8 క్రస్టుగేట్లు 18 అడుగుల మేర ఎత్తి 3,54,735 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శనివారం రాత్రి 9 గంటల సమయానికి జలాశయానికి 3,85,882 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది.



- ఉధృతంగా వాగులు, వంకలు
- పంట పొలాల్లో నిలిచిన వర్షపు నీరు
- లోతట్టు కాలనీలు జలమయం

కేజీరోడ్డుపై నేలకూలిన వృక్షాలు

ఆత్మకూరులోని కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై పట్టణ శివార్లలోని నాగమణి హోటల్ సమీపంలో ఉన్న రావి, చింత కలయికతో ఉన్న ఓ భారీ వృక్షం వేళ్లు బలహీనపడి శనివారం మధ్యాహ్నం కూలిపోయింది. ఆత్మకూరు డీఎస్పీ ఆర్. రామాంజీ నాయక్, ఎస్సై వెంకటనారాయణరెడ్డి అక్కడికి చేరుకుని పరిశీలించారు. ఎక్స్‌కవేటర్‌ను తెప్పించి నేలవాలిన చెట్టును తొలగించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించారు. అలాగే కరివేన, సిద్ధాపురం చెరువు కట్ట పక్కనే కేజీరోడ్డుపై కూలిన చెట్లను పోలీసులు తొలగించారు.



ఇల్లూరు కొత్తపేటలో మోకాళ్లపై నిలబడి దివ్యాంగురాలికి పింఛన్ అందజేస్తున్న మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి

జోరు వానలు



ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తున్న ఆత్మకూరు డీఎస్పీ

నంద్యాల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం రాత్రి నుంచి శనివారం రాత్రి వరకు వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. దీంతో జిల్లా వ్యాప్తంగా ఉన్న వాగులు, వంకలు నిండాయి. అత్యధికంగా శ్రీశైలంలో 6.6 సెంటిమీటర్ల వర్షం కురవగా, నందికొట్కూరు మండలంలో 5.4 సెం.మీ, రుద్రవరంలో 4 సెం.మీ, జూపాడుబంగ్లాలో 3.9 సెం.మీ, కొత్తపల్లిలో 3.8 సెం.మీ, మహానందిలో 3.7 సెం.మీ, ఆత్మకూరు, శిరివెళ్ల, మిడ్తూరులో 3.6 సెం.మీ, గోస్పాడు మండలంలో 3.4 సెం.మీ వర్షపాతం నమోదైంది. అత్యల్పంగా కొలిమిగుండ్లలో 0.2 సెం.మీ వర్షం కురిసింది. కాలువలు నిండుగా పారుతుండటంతో రైతులు సంతోషంగా వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. రోజంతా వర్షం కురవటం వల్ల పాత మట్టి మిద్దెలు నాని కూలిపోతున్నాయి. తుపాను కారణంగా రాబోయే రెండు మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా యంత్రాంగం హెచ్చరికలు జారీ చేసింది.

ఆత్మకూరు, ఆగస్టు 31: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో ఆత్మకూరు ప్రాంతంలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం రాత్రి నుంచి ప్రారంభమైన వర్షం శనివారం వరకు కురుస్తూనే వుంది. శనివారం ఉదయం 7గంటలకు 36.8 మిమీల వర్షపాతం నమోదు కాగా మధ్యాహ్నం 3 గంటలకు మరో 37.8 మిమీల వర్షం కురిసింది. దీంతో ఆత్మకూరు మండలంలోని చెరువులు నిండుకుండలా ఉండగా వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహించాయి. అదేవిధంగా నల్లమల అటవీ ప్రాంతంలో కురిసిన భారీ వర్షంతో రాళ్లవాగు మీదుగా సిద్ధాపురం చెరువులోకి 10అడుగుల మేర నీటినిల్వలు చేరుకున్నాయి. అలాగే వరదరాజస్వామి ప్రాజెక్టులోకి కూడా భారీగా వర్షపునీరు చేరింది. పట్టణంలోని గరీబ్‌నగర్, ఏకలవ్యనగర్, సాయిబాబానగర్, రహమత్‌నగర్, కప్పకుంట, అప్పారావువీధి, తిక్కయ్యస్వామి దర్గా, ఇందిరానగర్, ఏరాసు అయ్యపురెడ్డినగర్, అర్బన్‌కాలనీ, ఏబీఎం పాలెం, ఎస్సీజీపాలెం తదితర ఏరియాల్లోని లోతట్టుకాలనీల్లో వర్షపునీరు నిలిచి ప్రజలు తీవ్ర అసౌకర్యానికి లోనయ్యారు. అలాగే పట్టణ శివార్లలో భవనాశి, పడేవాగు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పలు గ్రామాల్లోని పంటపొలాల్లో కూడా వర్షపునీరు నిలిచిపోయాయి.

వర్షపునీరు చేరిన ఆత్మకూరులోని కప్పలకుంట





రాజోలి ఆనకట్ట వద్ద పొంగి ప్రవహిస్తున్న కుందూ



పాలేరు వాగు వద్ద వాహనదారులను అప్రమత్తం చేస్తున్న ఎస్ఐ

రైతులు అప్రమత్తంగా ఉండాలి

జిల్లా వ్యవసాయాధికారి వైవీ మురళీకృష్ణ

నంద్యాల టౌన్, ఆగస్టు 31 : ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో రైతాంగం అప్రమత్తంగా ఉండి పంటలను సంరక్షించుకునే చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారి వైవీ మురళీకృష్ణ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పొలాల్లో నిలిచిన నీరు తొలగించి, పొలం ఆరిన వెంటనే అంతర్ సేద్యం చేసుకోవాలని సూచించారు. వర్షాలు తగ్గిన తరువాత లీటర్ నీటికి 1.0 మిల్లీలీటర్ల ప్రొపికొనజోల్ మందును కలిపి సాయంత్రం వేళల్లో పిచికారి చేయాలని, లేదా లీటర్ నీటికి 2.0 మిల్లీలీటర్ల హెక్సాకొనజోల్ లేక 2.0 మిల్లీలీటర్ల వాలిడామైసిన్ లేక 1.0 ప్రొపికొనజోల్ లేక 0.4 గ్రాముల ట్రైఫ్లాక్సీస్ట్రోబిన్ 25 శాతం, టెబుకొనజోల్ 50 శాతం కలిపి పిచికారి చేయాలని అన్నారు.

పేదల సంక్షేమమే లక్ష్యం

మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి

బనగానపల్లె , ఆగస్టు 31: పేదల సంక్షేమమే తెలుగుదేశం ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. శనివారం బనగానపల్లె మండలంలోని ఇల్లూరుకొత్తపేటలో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఒకరోజు ముందుగానే మంత్రి బీసీ ప్రారంభించారు. వర్షం కురుస్తున్నా అధికారులతో కలిసి మంత్రి ఇంటింటికి తిరిగి పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీసీ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం గ్రామీణ పంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేసిందన్నారు. గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించకుండా గ్రామాలపై నిర్లక్ష్యం వహించారన్నారు. తమ ప్రభుత్వంలో గ్రామాలను అన్ని విధాలా అభివృద్ధి పరచి మౌలిక వసతులు కల్పిస్తానన్నారు. అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు.

లోటు బడ్జెట్‌లోనూ పింఛన్ల పంపిణీ

మంత్రి ఎన్ఎండీ ఫరూక్



వర్షంలో సామాజిక పింఛన్ పంపిణీ చేస్తున్న మంత్రి ఫరూక్

నంద్యాల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం లోటు బడ్జెట్‌లో ఉన్నా ఇచ్చిన మాటకు కట్టుబడి సమయానికి పింఛన్లను మంజూరు చేస్తున్నామని మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పేర్కొన్నారు. శనివారం వర్షం కురుస్తున్నప్పటికి మంత్రి ఫరూక్ మున్సిపల్, సచివాలయ సిబ్బందితో 26,27 వార్డుల్లో పింఛన్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ అవగాహన రాహిత్యంతో రాష్ట్ర ఖజానా ఖాళీ అయిందని మండిపడ్డారు. రాష్ట్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులను సైతం దారి మళ్లించిందని మంత్రి ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి, కౌన్సిలర్లు జైనాబి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

వినాయక మండపాల ఏర్పాటుకు సింగిల్ విండో విధానం : ఎస్పీ



నంద్యాల క్రైం, ఆగస్టు 31: వినాయక మండపాల ఏర్పాటుకు ప్రభుత్వం సింగిల్ విండో విధానాన్ని తీసుకొచ్చిందని ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ వినాయక మండపాల ఏర్పాటుకు గతంలో మాదిరి కాకుండా గణేష్ డాట్ నెట్ అనే వెబ్‌సైట్‌లో గణేష్ మండపం ఏర్పాటు చేసే కమిటీ సభ్యుల వివరాలు, ప్రదేశం, పోలీస్ స్టేషన్ పరిధి, విగ్రహం ఎత్తు, విగ్రహ ప్రతిష్ఠ తదితర వివరాలను నమోదు చేసి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇదే సౌకర్యాన్ని ప్రజలు 79950 95800 వాట్సాప్ నెంబర్‌కు ద్వారా హాయ్ అని సందేశం పంపిస్తే చాలు నిరభ్యంతర పత్రం కోసం అనుసరించాల్సిన ప్రక్రియ మొత్తం వస్తుందని తెలిపారు. నంద్యాల జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందన్నారు. భారీ విగ్రహాలు ఏర్పాటు చేసే మంటపాల వద్ద తప్పనిసరిగా తాత్కాలిక సీసీటీవీలను, పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేసుకోవాలని నిర్వాహకులకు ఎస్పీ సూచించారు.

పశు బీమా.. రైతుకు ధీమా ..

- మార్గదర్శకాలు విడుదల చేసిన ప్రభుత్వం
- గత వైసీపీ పాలనలో అటకెక్కిన పథకం
- టీడీపీ రాకతో జిల్లాలో మళ్లీ ప్రారంభం

కొలిమిగుండ్ల, ఆగస్టు 31 : రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయం, పాడి పరిశ్రమకు ప్రత్యేక ప్రాధాన్యత లభిస్తోంది. ఇందులో భాగంగానే పశు బీమా పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం తిరిగి ప్రారంభించింది. పాడి పశువు మరణించిన రోజుల వ్యవధిలోనే సంబంధిత రైతులకు సాయం అందుతుంది. దీంతో ఆ రైతు తిరిగి కొత్త పశువులను కొనుగోలు చేయడానికి ఇది ఉపకరిస్తుంది. పాడి పశువులకు చెల్లించే బీమా సొమ్ములో ప్రస్తుత ప్రభుత్వం రాయితీ కల్పించింది. ఎస్సీ, ఎస్టీ రైతులకైతే 80 శాతం, మిగిలిన రైతులకు 50 శాతం రాయితీ కల్పిస్తూ ప్రోత్సాహం అందిస్తోంది. ఇందులో మామూలు పశువులకు రూ.15 వేలు, మేలు జాతి పశువులకు రూ.30 వేల బీమా సదుపాయం కల్పించారు. అయితే రైతులు ఇంతకంటే ఎక్కువ సొమ్ముకు బీమా చేసుకోవాలని భావిస్తే అదనంగా అయ్యే మొత్తాన్ని రైతులే భరించాల్సి ఉంటుంది. ఒక్కో పశువుకు గరిష్ఠంగా రూ.1.10 లక్షల వరకు బీమా చేసుకునే అవకాశం ఉంది. ఈ బీమా సొమ్ముకు మూడేళ్ల కాల పరిమితి ఉంటుంది. పాడి పశువులతోపాటు గొర్రెలు, మేకలు, పందులకు సైతం రాయితీపై బీమా చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. ఒక కుటుంబం నుంచి ఐదు పశువులకు బీమా చేసుకోవచ్చు. జీవాలకు సంబంధించి ఒక కుటుంబానికి 50 గొర్రెలు లేదా మేకలకు అవకాశం ఉంది. దీనికి సంబంధించి, నంద్యాల జిల్లాకు రూ.12 లక్షల బీమా రాయితీ సొమ్మును ప్రభుత్వం కేటాయించింది.

మార్గదర్శకాలు ఇలా..

పశువులకు బీమా చేసుకునే రైతు బ్యాంకు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులైతే తెల్ల రేషన్‌కార్డు అందించాల్సి ఉంటుంది. స్థానిక పశు వైద్య కేంద్రాలు, రైతు సేవా కేంద్రాల్లోని సిబ్బందిని సంప్రదించి బీమా చేసుకోవాలి. పాడి పశువులకు బీమా చేసే సమయంలో పశువుకు చెవి పోగు(ట్యాగ్) వేస్తారు. ఏదైనా అనుకోని కారణాల వల్ల చెవి పోగు పడిపోతే వెంటనే అందుబాటులో ఉన్న పశువైద్య సిబ్బందికి సమాచారం ఇచ్చి, తిరిగి చెవిపోగు వేయించుకోవాలి. పశువుకు చెవి పోగు ఉంటేనే బీమా పరిహారం అందుతుంది. బీమా చేయించిన పశువును విక్రయిస్తే వారం రోజుల్లో అధికారులకు తెలియజేయడం వల్ల యజమాని పేరు మార్చుకునే అవకాశం కూడా ఉంది. ఏదైనా సంఘటనతో పశువు మరణిస్తే వెంటనే సమీపంలోని రైతు సేవా కేంద్రంలో ఉన్న పశువైద్య సిబ్బందికి సమాచారం అందించాలి. బీమా సర్వేయర్ వచ్చే వరకు చెవి పోగును తీయరాదు. పశు పోషకులు ఈ నిబంధనలు తప్పక పాటించాల్సి ఉంటుంది.



వైసీపీ పాలనలో నష్టపోయిన రైతులు

పరిశ్రమను పూర్తిగా నీరు గార్చారు. పశువుల బీమాకు మొదటి నాలుగేళ్లలో ఒక్క రూపాయి విడుదల చేయలేదు. పశువు మరణిస్తే నష్ట పరిహారం చెల్లిస్తామని, బీమా అవసరం లేదని చెప్పిన వైసీపీ ప్రభుత్వం పాడి రైతులను నిలువునా ముంచింది. నష్ట పరిహారం అందించడంలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించడంతో పాడి రైతులు తీవ్రంగా నష్టపోయారు. చివరి సంవత్సరం ఎన్నికల ముందు పశు బీమా పథకం అంటూ హడావుడి చేశారు. విడుదల చేసిన మార్గదర్శకాలు లోప భూయిష్ఠంగా ఉండడంతో రైతులు బీమా చేయడానికి సైతం మొగ్గు చూపలేదు. కూటమి అధికారంలోకి రావడంతో పాడి రైతులకు మళ్లీ పూర్వ వైభవం వచ్చింది.

పాడి పశువుల బీమా సొమ్ము, రైతు చెల్లించాల్సిన వాటా వివరాలు

లబ్ధిదారులు	అందించే బీమా	ప్ర. రాయితీ	లబ్ధిదారుని వాటా
ఎస్సీ, ఎస్టీ రైతులు	రూ.15,000	రూ.768	రూ.192
	రూ.30,000	రూ.1536	రూ.384
సాధారణ రైతులు	రూ.15,000	రూ.480	రూ.480
	రూ.30,000	రూ.960	రూ.960
గొర్రెలు, మేకలు	రూ.6000	రూ.135	రూ.54

అవగాహన కల్పిస్తున్నాం

పశు బీమాపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. మండలాల వారిగా అధికారులకు దిశా నిర్దేశం చేశాం. నంద్యాల జిల్లాకు రూ.12లక్షల బీమా సొమ్మును ప్రభుత్వం కేటాయించింది. రైతులకు అవసరమైతే మరింత కేటాయింపులు జరుగుతాయి. పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

- డాక్టర్ గోవింద్ నాయక్, నంద్యాల జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి

విద్యుత్ శాఖ అనుమతులు తప్పనిసరి : ఎస్ఈ



విద్యుత్‌శాఖ ఎస్ఈ యం.ఉమాపతి

కల్లూరు, ఆగస్టు 31: ఉమ్మడి కర్నూలు జిల్లాలో గణేష్ మండపాల్లో తాత్కాలిక విద్యుత్ సరఫరాకు నిర్వాహకులు రిజిస్ట్రేషన్ చేసుకుని ప్రమాదాల నివారణకు సహకరించాలని ఎస్ఈ యం.ఉమాపతి పిలుపునిచ్చారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో పలు వివరాలను వెల్లడించారు. విద్యుత్‌శాఖ పరిధిలోని అన్ని డివిజన్లలో గణేష్ మండపాల నిర్వాహకులు ఆయా డివిజన్లు, సబ్ డివిజన్ కార్యాలయాల్లో ఈఈలు, ఏడీఈ, ఏఈలను కలిసి కనీస చార్జీలు చెల్లించి అధికారులకు సహకరించాలన్నారు. సమీపంలోని మీసేవా, సచివాలయాల్లో రుసుము, చార్జీల చెల్లింపుతో పాటు గణేష్ మండపాల నిర్వాహకుల సమ్మతిని అధికారులకు తెలియజేయాలని ఎస్ఈ కోరారు. డివిజన్ల వారీగా అధికారులు తప్పకుండా కనీస చార్జీలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

94.5 శాతం పంపిణీ : కలెక్టర్



కొత్తపల్లెలో పింఛన్ అందజేస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల (కల్చరల్), ఆగస్టు 31: జిల్లా వ్యాప్తంగా శనివారం సాయంత్రం 6 గంటలకు 94.5 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేసినట్లు కలెక్టర్ రాజకుమారి తెలిపారు. నంద్యాల, బండిఆత్మకూరు మండలాల్లో కలెక్టర్ రాజకుమారి ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. సాయంత్రం 6 గంటలకు జిల్లాలో 2,07,003 మందికి పింఛన్లు అందాయని తెలిపారు.

3న జిల్లా స్థాయి ఆట్యా పాట్యా ఎంపిక పోటీలు

కర్నూలు(స్పోర్ట్స్), ఆగస్టు 31: స్థానిక డీఎస్‌ఏ అవుట్ డోర్ స్టేడియంలో ఈ నెల 3న ఉదయం 10 గంటలకు ఉమ్మడి కర్నూలు జిల్లా స్థాయి (బాలుర, బాలికలకు) ఆట్యా పాట్యా ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అలాగే ఎంపికైన క్రీడాకారులు సెప్టెంబరు 13 నుంచి 14వ తేదీ వరకు కర్నూలులో జరగబోయే రాష్ట్ర స్థాయి ఆట్యా పాట్యా చాంపియన్ షిప్‌లో పాల్గొంటారని 01.01.2007 అర్హత ఉండాలని, జిల్లా ఆట్యా పాట్యా సంఘం కార్యదర్శి బి. పవన్ తెలిపారు. వివరాలకు 9393855450, 9032104158 నెంబర్లను సంప్రదించాలన్నారు.

ఆరు రోజులపాటు సీపీఐ ఆందోళన

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 31: సీపీఐ జాతీయ సమితి పిలుపు మేరకు అధిక ధరలు తగ్గించాలని కోరుతూ 1వ తేదీ నుంచి 6 వరకు ఆందోళనలు చేస్తున్నట్లు జిల్లా కార్యదర్శి బి. గిడ్డయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని, ప్రజా పంపిణీ వ్యవస్థను మెరుగు పరచాలని, పెట్రోలు, డీజిల్ ధరలు తగ్గించాలని కోరుతూ అన్ని నియోజకవర్గాల కేంద్రాల్లో జరిగే ఆందోళనలు జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. 6న జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

6న హ్యాండ్‌బాల్ అంతర్ పాఠశాలల పోటీలు

కర్నూలు(స్పోర్ట్స్), ఆగస్టు 31: జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబరు 6న స్థానిక డీఎస్‌ఏ అవుట్‌డోర్ స్టేడియంలో అంతర్ పాఠశాలల బాలబాలికల పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా సంఘం కార్యదర్శి పి. సువర్ణ శనివారం తెలిపారు. విజేతలతో పాటు మూడో స్థానంలో నిలిచిన జట్లకు కప్పులతో పాటు పతకాలను బహూకరిస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా జట్లను సబ్ జూనియర్ అండర్-15 రాష్ట్ర స్థాయికి హ్యాండ్‌బాల్ చాంపియన్ షిప్స్‌కు పంపుతున్నట్లు ఆమె తెలిపారు. ఎంపికలో పాల్గొనే ఒక్కో క్రీడాకారుడు రూ.10 దరఖాస్తు రుసుము చెల్లించి ఈ నెల 5వ తేదీలోపు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

గ్రానైట్ తరలిస్తున్న లారీకి జరిమానా

కర్నూలు(అర్బన్), ఆగస్టు 31: ఒంగోలుజిల్లా చీమకుర్తి నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా గ్రానైట్ తరలిస్తున్న లారీని సీజ్ చేసినట్లు గనుల శాఖ డిప్యూటి డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. శనివారం ఉదయం కర్నూలు నగర శివారులో తనిఖీలు నిర్వహించగా రికార్డులు లేని గ్రానైట్ లారీని గుర్తించామన్నారు. దీంతో లారీ యజమాని శంకర్ రెడ్డికి రూ.3 లక్షల జరిమానా విధించామని తెలిపారు.

చెరువులో పడి మహిళ మృతి

మహానంది, ఆగస్టు 31: మహానంది మండలం గోపవరం గ్రామానికి చెందిన గుమ్మా లక్ష్మీదేవి (43) ప్రమాదవశాత్తు చెరువులో జారి పడి మృతి చెందింది. శనివారం ఉదయం యథావిధిగా బర్రెలను మేపేందుకు గ్రామ శివారులోని భైరవాని చెరువు పరిసరాల్లోకి లక్ష్మీదేవి వెళ్ళింది. ఈ క్రమంలో కొన్ని బర్రెలు చెరువులోకి వెళ్ళడం గమనించిన ఆమె వాటిని తప్పించబోయి ప్రమాదవశాత్తు కాలు జారి చెరువులో పడి మృతి చెందింది. సాయంత్రం అయినా ఇంటికి రాక పోవడంతో అనుమానం వచ్చి కుటుంబ సభ్యులు చెరువు పరిసరాల్లో వెతకగా లక్ష్మీదేవి మృతదేహం చెరువులో తేలియాడుతూ కనిపించింది. స్థానికుల సహకారంతో మృతదేహాన్ని గట్టుకు చేర్చారు. సంఘటన స్థలాన్ని మహానంది ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు ధర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

నలుగురికి పీహెచ్‌ఎన్‌లుగా పదోన్నతి



కడప రీజనల్ డైరెక్టర్ డా.వై. శ్రీనివాసులును కలిసిన ఎంపీహెచ్‌ఈవోలు

కర్నూలు(హస్పిటల్), ఆగస్టు 31: కడప జోన్-4 పరిధిలో హెల్త్ సూపర్ వైజర్లు, ఆరోగ్య కార్యకర్తలకు పదోన్నతులు కౌన్సెలింగ్ వైద్య ఆరోగ్యశాఖ రిజనల్ డైరెక్టర్ (కడప) కార్యాలయంలో శనివారం ముగిసింది. నలుగురు సూపర్ వైజర్లుకు పీహెచ్‌ఎన్‌లుగా పదోన్నతుల కౌన్సెలింగ్‌ను కడప ఆర్‌డీ డా.వై. శ్రీనివాసులు నిర్వహించారు. 18 మంది హెల్త్ అసిస్టెంట్లకు హెల్త్ సూపర్‌వైజర్లు పదోన్నతుల కౌన్సెలింగ్‌ను ఆర్‌డీ నిర్వహించారు. ఈ మేరకు కౌన్సెలింగ్ ప్రశాం తంగా నిర్వహించినందుకు కర్నూలు జిల్లా వైద్యఆరోగ్య శాఖ ఉద్యోగులు ఎంపీహెచ్‌ఈవో కె.నరసప్ప, హనుమంతు కడప ఆర్‌డీని కలిసి అభినందనలు తెలిపారు.సూపర్‌వైజర్లు శ్రీలక్ష్మి, శారద, భాగ్యమ్మ, కొత్తురమ్మ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

బైకును ఢీకొన్న లారీ



జయకుమార్ (ఫైల్)



డేవిడ్ పాల్ (ఫైల్)

వెల్దుర్తి, ఆగస్టు, 31: వెల్దుర్తి మండలంలో శనివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ దుర్ఘటనలో ద్విచక్ర వాహనదారులు డేవిడ్ పాల్ (52), పాలెం జయకుమార్ (49) అక్కడికక్కడే దుర్మరణం చెందారు. నంద్యాల జిల్లా డోన్ టీచర్స్ కాలనీకి చెందిన జయకుమార్ ప్రైవేటు సర్వేయర్, డేవిడ్‌పాల్ సహాయకుడు. వీరిరువురు తమ పనులు ముగించుకొని ఏపీ39 జీఈ 9306 నెంబరు గల ద్విచక్ర వాహనంపై డోన్‌కు బయలుదేరారు. మార్గమధ్యంలో వెల్దుర్తి మండలం మదార్‌పురం గ్రామం దాటిన తరువాత జాతీయ రహదారి-44లో నూతనంగా నిర్మించిన హిందూస్తాన్ పెట్రోల్ బంకు వద్ద వెనుక వైపు నుండి ఆర్‌జే11 జీసీ 4981 నెంబరు గల లారీ ఢీ కొట్టడంతో ఇద్దరు అక్కడికక్కడే చనిపోయారు. ఈ ఘటనలో లారీ 100 మీటర్లు బైకును ఈడ్చుకొని వెళ్ళడంతో డేవిడ్ పాల్ తల వేరయి, శరీరం ఛిద్రమయింది. లారీ డ్రైవర్, క్లీనర్ వాహనాన్ని వదిలిపెట్టి పరారయ్యారు. హైవే పెట్రోలింగ్ పోలీసులు అక్కడ కు చేరుకొని ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు. వెల్దుర్తి పోలీసులు గ్రామ పంచాయతీ కార్మికులచేత మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం వెల్దుర్తి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. డేవిడ్‌పాల్‌కు పెళ్లి కాలేదు. జయకుమార్‌కు భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. భార్య గౌరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రెగ్యులర్ అధ్యాపకుల కొరత



ప్రభుత్వ మైనారిటీ జూనియర్ కళాశాల

- పదవీ విరమణతో ఖాళీ అవుతున్న పోస్టులు
- కాంట్రాక్ట్ అధ్యాపకులతోనే బోధన
- నాగులదిన్నె, కర్నూలు మైనారిటీ కళాశాలలకు మంజూరుకాని పోస్టులు
- ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో దుస్థితి

కర్నూలు(ఎడ్యుకేషన్), ఆగస్టు 31: జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అధ్యాపకుల కొరత వేధిస్తోంది. ఈ పోస్టుల భర్తీలో తీవ్ర కాలయాపన జరుగుతోంది. దీని వల్ల పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదు. కాంట్రాక్ట్ అధ్యాపకులతోనే చదువు చెప్పిస్తున్నారు. విధిలేక పేద కుటుంబాల పిల్లలు కూడా ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలో చేరవలసి వస్తున్నది. గత 15 సంవత్సరాల నుంచి కొత్త రిక్రూట్‌మెంట్ లేక పోగా, ఉన్న అధ్యాపకులు పదవీ విరమణ వల్ల 60 శాతం పైగా కళాశాలలో అధ్యాపకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

కర్నూలు జిల్లాలో 23 కళాశాలలు ఉన్నాయి. ఈ కళాశాలలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 7 వేలు మంది చదువుతున్నారు. ఈ కళాశాలల్లో రెగ్యులర్ అధ్యాపకులు లేకపోవడం వల్ల నాణ్యమైన విద్య అందడం లేదు. దీనితో అనేక ఆర్థిక ఇబ్బందుల మధ్యనే కార్పొరేట్ కళాశాలల్లో చేరుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే కొద్ది కాలానికి ప్రభుత్వ కళాశాలలు మూతపడే పరిస్థితి వస్తుంది.

మొత్తం మంజూరు పోస్టులు 356

కర్నూలు జిల్లాలోని 23 ప్రభుత్వ కళాశాలలో మొత్తం 356 పోస్టులు ఉన్నాయి. ప్రస్తుతం రెగ్యులర్ పోస్టులు 156, కాగా కాంట్రాక్ట్ అధ్యాపకులు 171 మంది, ఇతరులు 29 మంది మాత్రమే పనిచేస్తున్నారు. పదవీ విరమణ పొందిన వారి స్థానంలో కొత్త నియామకాలు చేపట్టడం లేదు. కాంట్రాక్ట, గెస్ట్ అధ్యాపకుల చేతనే విద్యార్థులకు బోధన కొనసాగుతోంది. రెగ్యులర్ అధ్యాపకులను నియమించడంలో తీవ్ర అలసత్వం కొనసాగుతున్నది. ప్రస్తుతం అందరి దృష్టి ఇంజనీరింగ్, మెడికల్, అగ్రికల్చర్, ఫార్మసీ వంటి కోర్సులపై మళ్లింది. ఈ కోర్సులకు వెళ్ళాంటే మంచి మార్కులు రావాలి. ఇంటర్‌లో నాణ్యమైన విద్య ఉంటేనే ఇదంతా సాధ్యం. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నాణ్యమైన విద్య గ్యారెంటీ కాదు. గత 5 సంవత్సరాల క్రితం నాగులదిన్నె, కర్నూలు ప్రభుత్వ మైనారిటీ జూనియర్ కళాశాలలు మంజూరయ్యాయి. వీటికి ఒక రెగ్యులర్ పోస్టు కూడా మంజూరు కాకపోవడంతో ఒక సీనియర్ అధ్యాపకుడ్ని ప్రిన్సిపాల్‌గా నియమించి, తాత్కాలిక అధ్యాపకులతో సరిపెట్టుకున్నారు. ప్రభుత్వం ఈ దుస్థితి నుంచి ప్రభుత్వ కళాశాలలను బైట పడేయడానికి చిత్తశుద్ధితో పని చేయడం లేదనే విమర్శ ఉంది.

అధ్యాపకుల కొరత లేకుండా చర్యలు...



ప్రభుత్వ కళాశాలలో అధ్యాపకుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. కాంట్రాక్ట్ అధ్యాపకులు పనిచేస్తున్నారు. ఇంకా కొరత ఉంటే, గెస్టు అధ్యాపకులను గంటల ప్రాతిపదికపై నియమించడానికి ప్రయత్నిస్తున్నాం. అధ్యాపకులను నియమించి మంచి విద్య అందేలా చర్యలు తీసుకుంటున్నాం.

పరమేశ్వర రెడ్డి, డీవీఈవో, కర్నూలు

ఒకే గదిలో పలు తరగతులు



ఇరుకు గదిలో నేలపై చదువుకుంటున్న విద్యార్థులు

- 8 తరగతులకు మూడు చిన్న గదులు
- అవీ కాంక్రీట్ నిర్మాణం కాదు.. షెడ్లు మాత్రమే
- మరుగుదొడ్లు నిల్
- ప్రాథమిక పాఠశాలలో ఒక టాయిలెట్ మాత్రమే



కర్నూలు(ఎడ్యుకేషన్), ఆగస్టు 31: నగర పాలక పరిధిలోని స్టాంటన్‌పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులను తరగతి గదుల కొరత వేధిస్తోంది. ఒకే గదిలో 2, 3 తరగతుల విద్యార్థులను కూర్చోబెట్టి తరగతులను నిర్వహిస్తున్నారు. ఈ పాఠశాల ప్రాంగణంలో ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం భవనం, హై స్కూల్ నిర్వహణ కొనసాగుతుంది. ఈ మూడు విద్యాసంస్థలకు కలిపి ఒకే మరుగుదొడ్డి ఉంది. దాన్ని వినియోగించుకోవాలంటే గంటల తరబడి వేచి ఉండాలి. ముఖ్యంగా బాలికల పరిస్థితి ఆగమ్యగోచరంగా ఉంది. సకాలంలో యూరిన్‌కు వెళ్లలేక అనారోగ్య సమస్యలకు గురవుతున్నారు. వర్షం వస్తే.. విద్యార్థులకు ఆ రోజు పాఠశాలకు సెలవే. గత పది సంవత్సరాల కింద ఈ పాఠశాల గదుల నిర్మాణం కోసం గని గుంతల్లో స్థలం కేటాయించారు. ప్రభుత్వం గదుల నిర్మాణానికి రూ.1.30 కోట్లు కేటాయించారు. ఈ గదుల నిర్మాణానికి స్థలం అనువుగా లేకపోవడంతో నిర్మాణం చేపట్టలేకపోయారు. హై స్కూల్‌లో మూడు గదులు ఉన్నాయి. టాపు పైన షెడ్డును నిర్మించారు. హైస్కూల్ విద్యార్థులు మొత్తం 286 మంది విద్యార్థులు 3 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్నారు. ఈ విద్యార్థులకు కనీసం 8 గదులు అవసరం. అలాగే ప్రాథమిక పాఠశాలలో 69 మంది, అంగన్‌వాడీ కేంద్రంలో 29 మంది చిన్నారులు ఉన్నారు. గత వైసీపీ ప్రభుత్వం నాడు-నేడు కింద రూ. వేల కోట్లు ఖర్చు చేసినప్పటికీ కనీసం మౌలిక వసతులు కల్పించలేకపోయారు. ప్రస్తుత ప్రభుత్వమైనా చర్యలు తీసుకుని స్థలం కేటాయించి తరగతుల గదుల నిర్మాణం చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

సీమ సాగునీటికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలి



- అమరావతి, పోలవరంలాగే సీమకు ప్రత్యేక నిధులు రాబట్టాలి
- సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి
- సీఎం చంద్రబాబుకు లేఖ

నంద్యాల టౌన్, ఆగస్టు 31: రాయలసీమ సాగు నీటి రంగాన్ని అభివృద్ధి చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆయన ఈ మేరకు సీఎంకు ఒక లేఖను ఈ మెయిల్ ద్వారా పంపిచారు. దీన్ని పత్రికా సమావే శంలో విడుదల చేస్తూ ఏపీ ఖజానాపై ఆర్థిక భారం పడకుండా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అత్యంత క్రియాశీలకంగా వ్యవహరించి కేంద్రం నుంచి నిధులు విడుదల చేయించారని అన్నారు. తద్వారా అమరావతి రాజధాని, పోలవరం ప్రాజెక్టులకు కేంద్రం నిధుల కేటాయించినట్లే రాయలసీమ సమగ్ర సాగునీటి అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని కోరారు. అమరావతికి, పోలవరానికి కేంద్రం నుంచి నిధులు సాధించిన తరహాలోనే రాయలసీమ ప్రాజెక్టులకు కూడా నిధులు సాధించి గాడిన పెడతారని సీమ ప్రజలు ఆశతో ఉన్నారని అన్నారు. రాష్ట్రంలోని వ్యవసాయ యోగ్యమైన భూమిలో 42 శాతం రాయలసీమ జిల్లాల్లో ఉన్నప్పటికీ రాష్ట్ర సాగునీటి బడ్జెట్‌లో కేవలం 15 శాతం నిధులే గత 10 సంవత్సరాలుగా ఖర్చు చేస్తున్నారని అన్నారు. దీని వల్ల ఈ ప్రాంతంలో ప్రాజెక్టుల పురోగతికి ఆటంకం కలిగిందని అన్నారు. నిర్మించిన ప్రాజెక్టుల నిర్వహణకు కూడా నోచుకోక పోవడంతో సాగునీటి ఆధారంగా రాయలసీమలో పంటల సాగు ప్రశ్నార్థకంగా మారిందని అన్నారు.సాగునీటి బడ్జెట్‌లో 42 శాతం నిధులు రాయలసీమకు కేటాయించాలని సీఎంను కోరారు. విభజన చట్టంలో పొందుపరిచిన వెనుకబడిన జిల్లాల బుందేల్‌ఖండ్ తరహా ప్రత్యేక ప్యాకేజీ నిధులను కేంద్రం నుంచి తక్షణమే సాధించాలన్నారు. రాయలసీమలోని చెరువుల పరిరక్షణ, నిర్మాణం, వాగులు, వంకలు, నదులు, కాల్వలతో అనుసంధానం, పెన్నా నది పునరుజ్జీవం, సామాజిక అటవీ అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ మొదలైనవి ఒక నిర్దిష్ట ప్రణాళికతో చేపట్టాలని కోరారు.

ఆంజనేయస్వామి ఆలయంలో చోరీ



దొంగలు పగలగొట్టిన హుండీ

పత్తికొండ, ఆగస్టు 31: పత్తికొండ పట్టణం ఆదోని రహదారిలో నాయిబ్రాహ్మణవీధి సమీపంలో ఉన్న ఆంజనేయస్వామి దేవాలయంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. ఆలయానికి వేసి ఉన్న తాళాన్ని పగలగొట్టిన దొంగలు ఆలయంలో ఉన్న హుండీని ఎత్తుకెళ్లారు. సుమారు 300 కిలోల బరువు ఉన్న హుండీని ఆటోలో నిర్మానుష్య ప్రాంతానికి తీసికెళ్లి పగలగొట్టి అందులో ఉన్న సొమ్ము తీసుకున్నారు. స్వామికి సంబంధించి 18 తులాల వెండి నగలతోపాటు భక్తులు వేసిన కానుకలు హుండీలో ఉన్నాయని పూజారి తెలిపారు. సీఐ జయన్న సంఘటనా ప్రాంతాన్ని పరిశీలించారు. సీసీ కెమెరాల ఆధారంగా నలుగురు దొంగలు చోరీలో పాల్గొన్నట్లు అంచనాకు వచ్చారు.

విద్యుదాఘాతంతో పశువుల పాక దగ్ధం

శిరివెళ్ల, ఆగస్టు 31 : మండలంలోని గోవిందపల్లె గ్రామానికి చెందిన శంకరయ్య అనే వ్యక్తికి చెందిన పశువులపాకలో శుక్రవారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. పశువులపాకలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరగడంతో మంటలు చెలరేగి పాకలోని రెండు ఎద్దులు, నాలుగు పాడి గేదెలు, పది మేకలు అక్కడికక్కడే అగ్నికి ఆహుతయ్యాయి. దీంతో దాదాపు రూ.7 లక్షల మేర నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. పశువులే జీవనాధారంగా బతుకున్న తమకు ప్రభుత్వం సాయం అందించాలని బాధితుడు శంకరయ్య కన్నీటిపర్యంతమయ్యాడు.

జై హనుమా..!

ఘనంగా రణమండల ఆంజనేయ రథోత్సవం



పురవీధులలో ఊరేగుతున్న ఆంజనేయుడి రథం

ఆదోని (అగ్రికల్చర్), ఆగస్టు 31: ఆదోని పట్టణ శివారు ప్రాంతంలోని రణమండల ఆంజనేయ స్వామి రథోత్సవం శనివారం కన్నులపండువగా సాగింది. శ్రావణమాసం చివరి శనివారం కావడంతో కొండపై నుంచి రణమండల ఆంజనేయ విగ్రహాన్ని స్థానిక సాయిబాబా మందిరం వద్దకు తీసుకువచ్చి రథోత్సవంలో ఊరేగించారు. 40 రోజులపాటు రణమండల ఆంజనేయుడికి ప్రతిరోజు ప్రత్యేక పూజలు చేపట్టారు. ఉదయం సింధూర సేవ, ఆకుపూజ, మహా మంగళహారతి వంటి ప్రత్యేక పూజలను చేపట్టారు. చివరివారం కావడంతో కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడుకు చెందిన భక్తులు భారీగా తరలివచ్చారు. సాయంత్రం స్వామివారి రథోత్సవాన్ని సాయిబాబా మందిరం నుంచి మున్సిపల్ మెయిన్ రోడ్ శ్రీనివాస భవన్ నుంచి ఊరేగింపు చేపట్టారు. ఈ ఊరేగింపులో ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, చైర్‌పర్సన్ శాంత, విట్టా రమేష్, ఆలయ కమిటీ సభ్యులు టీజీ పాండురంగ తదితరులు పాల్గొన్నారు.



రథోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు



రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి

ఏకధాటిగా వర్షం

● పొంగిపొర్లిన వాగులు, వంకలు ● నీట మునిగిన పంటలు ● రోడ్లపై నిలిచిన నీరు ● రాకపోకలకు అంతరాయం



ఎద్దులేరు వాగును పరిశీలిస్తున్న డీఎస్పీ రామాంజి నాయక్



నందికొట్కూరులోని హాజీనగర్‌లో రోడ్డుపై పారుతున్న నీరు

నందికొట్కూరు, ఆగస్టు 31: గత రెండు రోజులుగా నందికొట్కూరు పట్టణంలో వర్షం కురుస్తూనే ఉంది. దీంతో మారుతి నగర్, హాజీ నగర్, తదితర లోతట్టు ప్రాంతాల్లో డ్రైనేజీ కాలువలు పొంగి పొర్లుతున్నాయి. మారుతి నగర్ ఎగువన పొలాల్లో కురిసిన వర్షానికి మారుతి నగర్, హాజీనగర్‌లోని డ్రైన్లు పొంగి రోడ్డుపై అడుగుపైగా వర్షపునీరు ప్రవహించింది. రోజంతా వర్షం కురుస్తుండడంతో డ్రైనేజీలు కూడా పొంగిపొర్లుతూనే ఉన్నాయి. మారుతి నగర్‌లో రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీటిని మున్సిపల్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు పరిశీలించారు.

కొత్తపల్లి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న వర్షాల్లో భాగంగా కొత్తపల్లి మండలంలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం వరకు ఏకధాటిగా వర్షాలు కురుస్తున్నాయి. మండలంలో ఉదయం నుంచి సాయంత్రం 5 గంటల వరకు కురిసిన వర్షానికి 50.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో శివపురం ఎద్దులేరు వాగు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో మండలంలోని శివపురం, మునలిమడుగు, ఎర్రమఠం, సింగరాజుపల్లి, గుమ్మడాపురం, పాతమాడుగుల తదితర గ్రామాల ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అలాగే నందికుంట, కొత్తపల్లి, గువ్వలకుంట్ల, కొక్కెరంచ గ్రామాల్లో వీధుల్లో సైతం వాగులను తలపిస్తున్నాయి. పంట పొలాలు కూడా నీట మునిగి చెరువులను తలపిస్తుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

● కొత్తపల్లి మండలంలోని శివపురం ఎద్దులేరు వాగు భారీ వర్షాలకు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో ఎవరూ కూడా ఆ వాగును దాటేందుకు ప్రయత్నించవద్దని ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్ హెచ్చరించారు. శనివారం సాయంత్రం ఆత్మకూరు సీఐ సురేష్ కుమార్ రెడ్డి, ఏఎస్ఐ బాబా ఫక్రుద్దీన్, శివపురం సర్పంచ్ చంద్రశేఖర్ యాదవ్‌తో కలిసి ఎద్దులేరు వాగును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వరద ఉధృతి ఎక్కువగా ఉన్నందుకు వరద తగ్గుముఖం పట్టే వరకు ఎవరూ దాటవద్దని హెచ్చరికలు జారీ చేశారు. అనంతరం ఇరువైపులా వాగును దాటకుండా తాడును అడ్డంగా కట్టారు.

వెలుగోడు: వెలుగోడు మండలంలో శుక్రవారం అర్ధరాత్రి నుంచి జోరుగా వర్షం కురుస్తోంది. ఎడ తెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వర్షం కుండపోతగా పడుతుండటంతో అధిక శాతం ఇంటికే పరిమిత మయ్యారు.



మహానంది: పాలేరువాగును పరిశీలిస్తున్న ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి

మహానంది: మహానంది మండలంలో శనివారం ఎడతెరపి లేకుండా వర్షం కురిసింది. దీంతో మండలంలో రైతులు విస్తారంగా సాగు చేసే వరి పంట నీట మునిగింది. గతంలో ఎన్నడు లేని విధంగా వర్షాకాలం సీజన్‌లో గత రెండు రోజుల నుండి వర్షం కురియడంతో నల్లమల అడవిలోని వాగులు వంకలు పొంగి ప్రవహించాయి. దీంతో మహానంది సమీపంలోని పాలేరువాగులో నీటి ఉధృతి మరింత పెరిగింది. నీటి ఉధృతి వాగుపై పెరిగితే మహానంది నుంచి గాజులపల్లి వైపు వాహనాలు వెళ్లే అవకాశం ఉండదు. సాయంత్రం మహానంది ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి సిబ్బందితో వెళ్లి పాలేరువాగును పరిశీలించారు. వాహనదారులను అప్రమత్తం చేశారు. కాగా గుంటూరు- గుంతకల్లు రైల్వే మార్గంలో డబల్ లైన్ నిర్మాణంలో భాగంగా మండలంలోని గోపవరం వద్ద లో లెవెల్ బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా నిర్మిస్తున్న బ్రిడ్జిని ఇరుకుగా అసంపూర్తిగా నిర్మించడంతో సమీపంలో రైతులు సాగు చేసే పంట పొలాల్లో నీట మునిగాయి. దీంతో ఆందోళన చెందిన రైతులు సెల్‌ఫోన్ ద్వారా గుంటూరు రైల్వే డీఆర్‌ఎంకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆయన నంద్యాల రైల్వే ఇంజనీరింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే అప్రమత్తం అయిన ఇంజనీరింగ్ శాఖ కాంట్రాక్టర్ ద్వారా ఆగమేఘాల మీద ఇరుకుగా నిర్మించిన బ్రిడ్జిని కొంత భాగం ఎక్సవేటర్ సాయంతో తొలగించారు. దీంతో వర్షపు నీరు సులభంగా ప్రవహించింది. వెంటనే చొరవ చూపిన రైల్వే ఇంజనీరింగ్ అధికారులకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

పాములపాడు: రుద్రవరం గ్రామంలో రామ బ్రహ్మయ్య, మల్లికార్జున, శ్రీనివాసులకు చెందిన మట్టి మిద్దెలు కూలిపోయాయి. సమయానికి వారు ఇళ్ళలో లేక పోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఇంట్లోని వస్తువులు మొత్తం మట్టిలో కూరుకుపోయాయి. కూలిపోయిన ఇళ్లను ఎమ్మెల్యే జయసూర్య పరిశీలించారు. అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

పండుగలా పింఛన్ల పంపిణీ



పాములపాడులో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎంపీ బైరెడ్డి శబరి

పాములపాడు, ఆగస్టు 31: మండలంలోని పింఛన్ పంపిణీ చేపట్టారు. పాములపాడులో కురువ ఎల్లయ్య, రమేశ్, ఎర్రగూడూరులో టీడీపీ నాయకులు బాలీశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి పింఛన్ పంపిణీ చేశారు. ఆర్డీవో దాస్, టీడీపీ నాయకులు కాకరవాడ చిన్న వెంకటస్వామి, తాటిపాడు నాగేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

● పింఛన్ పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే గిత్తా జయసూర్య హాజరై పంపిణీ చేశారు. మండలంలోని వేంపెంట గ్రామంలో ఇంటింటికి వెళ్లడంతో ఒక్కరోజు ముందే పింఛన్ల పండుగ వచ్చిందని ఓ వృద్ధుడు ఎమ్మెల్యేను కౌగిలించుకొని ఆనందం వ్యక్తం చేశారు. ఆర్డీవో దాస్, ఎంపీడీవో, తహసీల్దార్, వివిధ శాఖల అధికారులు టీడీపీ నాయకులు లక్ష్మీకాంతరెడ్డి, లెనిన్‌బాబు, ఆదిరెడ్డి, మధుకృష్ణ, చంద్రశేఖర్, సురేంద్రనాథ్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, హఫీజ్, లింగేశ్వరగౌడ్, మహేశ్‌గౌడ్, మధు తదితరులు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: జూపాడుబంగ్లాలో శనివారం ఎంపీ బైరెడ్డి శబరి పింఛన్ అందజేశారు. ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జగన్ ఏదో ఒక నిధులను మళ్లించి పింఛను అందజేసేవారని విమర్శించారు. రెండు, మూడురోజులైనా పింఛను అందించేవారుకాదని అన్నారు. ఎంపీడీవో నూర్జహాన్, టీడీపీ నాయకులు నాగేశ్వరరావు, కాకరవాడ చిన్నవెంకటస్వామి, సైఫుద్దీన్, రషీద్ మియ్యా, సుభాన్, బాలనారాయణగౌడు, పల్లెశివానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరురూరల్: మండలంలోని అల్లూరు గ్రామంలో ఎమ్మెల్యే జయసూర్య పింఛన్ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పింఛన్ పంపిణీలో అధికారులు నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు. కార్యక్రమంలో నాయకులు మాండ్ర సురేంద్రనాథరెడ్డి, మండల ప్రత్యేక అధికారి ఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి, ఎంపీడీఓ శోభారాణి, ఈవోఆర్డీ సంజన్న, గ్రామ కార్యదర్శులు చంద్రశేఖర్, రవీంద్రబాబు పాల్గొన్నారు.

మిడుతూరు: మండలలోని చౌట్కూరు గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను నియోజకవర్గ ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, టీడీపీ మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో జీఎన్ఎస్ రెడ్డి, ఈవోఆర్డీ ఫక్రుద్దీన్, పంచాతీ కార్యదర్శి సింగ్, నాయకులు సురేంద్రనాథ్ రెడ్డి, నరసింహ గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

నందికొట్కూరు: పట్టణంలో పింఛన్ అందజేశారు. మున్సిపల్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సచివాలయ అధికారులు పంపణీ చేశారు.

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణంతో పాటు ఆయా గ్రామాల్లో సచివాలయ ఉద్యోగులు, టీడీపీ నాయకులు లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. శనివారం పింఛన్ల సొమ్ము అందకపోతే సోమవారం అందజేస్తామని అధికారులు వెల్లడించారు.

వెలుగోడు: మండలంలో పింఛన్ పంపిణీ చేశారు. మండలంలో మొత్తం 6531 మందికి గానూ 6049 మందికి పింఛన్లను అందించి 93శాతం పూర్తి చేశారు. కార్యక్రమాల్లో అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



అల్లూరులో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

మహానంది: మహానంది మండలంలో 94.84 శాతం పింఛన్ పంపిణీ చేసినట్లు ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి తెలిపారు. ప్రత్యేకాధికారి మురళీకృష్ణ పింఛన్ల పంపిణీ కార్యక్రమాలను పరిశీలించారు. బుక్కాపురం, మహానంది గ్రామాల్లో టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త బన్నూరి రామలింగారెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

బండిఆత్మకూరు: మండలంలోని ఎ.కోడూరు గ్రామంలో సచివాలయ అధికారులు పంపిణీ చేస్తున్న పింఛన్ల అందజేతను కలెక్టర్ రాజకుమారి తనిఖీ చేశారు. సంతజూటూరు గ్రామంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి అబ్దుల్ రహిమాన్ పింఛన్ల పంపిణీ పరిశీలించి, లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. మండలంలో 94 శాతం పంపిణీ చేసినట్లు ఎంపీడీవో వాసుదేవగుప్తా తెలిపారు. బి.కోడూరు గ్రామంలో శ్రీశైలం ట్రస్టుబోర్డు మాజీ సభ్యుడు, టీడీపీ సీనియర్ నాయకుడు డాక్టర్ భరద్వాజశర్మ లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు.

గడివేముల: మండలంలో సచివాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు పింఛన్‌లు పంపిణీ చేశారు. మండలంలో 5,743 మంది లబ్ధిదారులు ఉండగా 5,335 మంది లబ్ధిదారులకు పింఛన్‌లు అందజేసినట్లు ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు.

మౌలిక వసతుల కల్పనకు రూ7.5 కోట్లు మంజూరు: మంత్రి

నంద్యాల ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): నంద్యాల మున్సిపల్ పరిధిలో రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సమస్యల పరిష్కారానికి, మౌలిక వసతుల కల్పనకు 15వ ఫైనాన్స్ నుంచి రాష్ట్ర ప్రభుత్వం రూ7.5 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చిందని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ శనివారం తెలిపారు. మౌలిక వసతుల కల్పనపై రాష్ట్ర సీఎం చంద్రబాబు నాయుడు, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో వారు స్పందించి నిధులను మంజూరు చేసినట్లు ఫరూక్ తెలిపారు. అలాగే రోడ్ల విస్తరణకు గత ప్రభుత్వం స్థలాలు సేకరించి తగు పరిహారం చెల్లించడంలో 2 ఏళ్ళుగా జాప్యం చేసిన విషయాన్ని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి దృష్టి కి తీసుకెళ్లడంతో ఇటీవలే ప్రభుత్వం రూ4.5 కోట్లు నిధులు విడుదల చేసినట్లు తెలిపారు.

● బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పా పీడనంతో భారీ వర్షాలు కురుస్తున్నాయని అధికారులు, ప్రజలు, అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర మంత్రి ఎన్ఎండీ ఫరూక్ సూచించారు. లోతట్టు ప్రాంత ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు ప్రజలకు సూచనలు చేయాలన్నారు. అవసరమైన సహాయక చర్యలకు ప్రభుత్వ సిబ్బంది సిద్ధంగా ఉండాలని అన్నారు. మ్యాన్‌హోల్, కరెంట్ తీగల వద్ద ప్రమాదాలు జరుగకుండా చూడాలన్నారు. వాగులు వంకల వద్ద హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేయాలని, ప్రజలు ప్రమాదాల బారిన పడకుండా చూడాలని అధికారులకు ఆదేశించారు.

విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ

మిడుతూరు, ఆగస్టు 31: మిడుతూరు గ్రామంలో పోతులూరి వీర బ్రహ్మం గారి మఠం దగ్గర కాతా రామచంద్రారెడ్డి , టీడీపీ మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి అధ్యక్షతన వేదపండితుడు మల్లికార్జున శర్మ ఆధ్వర్యంలో అభయ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠకు శనివారం భూమి పూజ నిర్వహించారు. ఎమ్మెల్యే గిత్తా జయసూర్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, ఎస్ఐ ఓబులేసు, కృష్ణమోహన్, నాగరాజు, చిన్న జమాల్‌బాషా, మధు, జయరాం, లక్ష్మీనారాయణ, పెద్దస్వామన్న పాల్గొన్నారు.

'బాలికలు జాగ్రత్తలు తీసుకోవాలి'

పాణ్యం, ఆగస్టు 31: సమాజంలో బాలికలు జాగ్రత్తలు తీసుకోవాలని ఉమెన్ డెవలపర్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ జిల్లా నోడల్ అధికారి లీలావతి సూచించారు. శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఉమెన్ సేఫ్టీ అండ్ సెక్యూరిటీ అనే అంశంపై విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. నోడల్ అధికారి మట్లాడుతూ అమ్మాయిలు ముఖ్యంగా అబ్బాయిల పట్ల జాగ్రత్తగా మెలగాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, బండిఆత్మకూరు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, నాగమణి, శ్వేత, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

'అనుమతి తీసుకోండి'

ఆత్మకూరు, ఆగస్టు 31: వినాయక మండపాల ఏర్పాటుకు అనుమతికి కోసం రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన సింగిల్ విండో క్లియరెన్స్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆత్మకూరు డీఎస్పీ ఆర్.రామాంజి నాయక్ సూచించారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రజలు వెసులుబాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం సింగిల్ విండో క్లియరెన్స్ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. దీని ప్రకారం మండపాల నిర్వాహకులు గణేష్ ఉత్సవ్ డాట్ నెట్ అనే వెబ్‌సైట్‌లో వివరాలను నమోదు చేయాలన్నారు. నిరభ్యంతర పత్రం కోసం అనురించాల్సిన ప్రక్రియను తెలుసుకోవాలంటే 7995095800 ఫోన్ నంబర్‌కు హాయ్ అని సందేశం పంపిస్తే వివరాలు వారి వాట్సాప్ నంబర్‌కు పంపించనున్నట్లు తెలిపారు.

దొంగల ముఠా అరెస్టు

నంద్యాల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): నంద్యాల తాలూకా స్టేషన్ పరిధిలో ముగ్గురు దొంగలను అరెస్ట్ చేసినట్లు నంద్యాల డీఎస్పీ యుగంధర్‌బాబు తెలిపారు. శనివారం డీఎస్పీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. చిత్తూరు జిల్లాకు చెందినగల్లా హేమచంద్ర తిరుపతి జిల్లాకు చెందిన షేక్ మస్తాన్, కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఆల్బర్ట్ ఆంటోనిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. కర్ణాటకకు చెందిన మరో ఇద్దరి కోసం గాలిస్తున్నామని చెప్పారు. నంద్యాల తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో పలు చోరీలకు పాల్గొన్నట్లు చెప్పారు. తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలోని రైతు నగరం సమీపంలోని వసంత నగర్‌లో అనుమనాస్పదంగా సంచరిస్తుండటంతో అదుపులోకి తీసుకుని విచారించగా దొంగలు నేరాలు ఒప్పుకున్నట్లు చెప్పారు. వారి వద్ద ఉన్న ఒక పాస్ పోర్టు రూ.1.50 లక్షల నగదు, బంగారు గొలుసు, ఉంగరం, జత కమ్మలు, ఐప్యాడ్, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. వీటి విలువ రూ.6 లక్షలు ఉంటుందని డీఎస్పీ తెలిపారు. సమావేశంలో తాలూకా అర్బన్ సీఐ అస్రార్ భాష, ఎస్ఐ గంగయ్య యాదవ్, సిబ్బంది పాల్గొన్నారు.

'వినాయక చవితిని ప్రశాంతంగా జరుపుకోవాలి'

బండిఆత్మకూరు, ఆగస్టు 31: గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఎంపీడీవో వాసుదేవగుప్తా, డిప్యూటీ తహసీల్దార్ మారిత, ఎస్ఐ జగన్‌మోహన్ సూచించారు. శనివారం సాయంత్రం తహసీల్దార్ కార్యాలయంలో గణేష్ మండపాల నిర్వాహకులు, యువకులకు సమావేశం నిర్వహించారు. ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ నటరాజ్, కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

కొత్తపల్లి ఎస్ఐగా కేశవ బాధ్యతలు స్వీకరణ

కొత్తపల్లి, ఆగస్టు 31: కొత్తపల్లి మండల పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా కేశవ శనివారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు. ఆయనకు స్థానిక ఏఎస్ఐ బాబ ఫక్రుద్దీన్‌తో పాటు పోలీసు సిబ్బంది కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈయన నంద్యాల జిల్లా హెడ్ క్వార్టర్ వీఆర్ నుంచి కొత్తపల్లి స్టేషన్‌కు ఎస్ఐగా బాధ్యతలు చేపట్టారు.

'విచారణ చేపట్టాలి'

నంద్యాల టౌన్, ఆగస్టు 31: మైనార్టీ సంక్షేమ, న్యాయశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ కుటుంబానికి సంబంధించిన ఖాళీ స్థలం వివాదం కోర్టులో ఉండగా ఆ స్థలానికి వీఎల్‌టీ విధింపుపై సమగ్ర విచారణ చేపట్టాలని వైసీపీకి చెందిన వైస్ చైర్మన్ పాంషావలి డిమాండ్ చేశారు. శనివారం చైర్‌పర్సన్ మాబున్నీ సా అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. వైస్ చైర్మన్ మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డిని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. టీడీపీ ఫ్లోర్ లీడర్ మాబూవలి, కౌన్సిలర్ నాగార్జున మాట్లాడుతూ కోర్టులో ఉన్న స్థలంపై మున్సిపల్ అధికారులు వీఎల్‌టీ విధించడంలో అంతర్యమేమిటని ప్రశ్నించారు. ఈ విషయంలో సమగ్ర విచారణ చేపట్టాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ కోర్టు వివాదంలో ఉన్న స్థలంపై వీఎల్‌టీ విధించడంపై సమగ్ర విచారణ, అందరి పాత్రపై నిగ్గు తేల్చాల్సిన అవసరం ఉందని అన్నారు. కోర్టులో ఉన్న స్థలంపై విధించిన వీఎల్‌టీని రద్దు చేస్తున్నట్లు తీర్మానం ఆమోదించారు.

మున్సిపాలిటీ పరిధిలోకి స్పోర్ట్స్ అథారిటీ స్థలం

నంద్యాల పట్టణంలోని పద్మావతినగర్‌లో ఉన్న రిజర్వ్ ఓపెన్ సైట్‌ను పురపాలక శాఖ ఇండోర్ స్టేడియం నిర్మాణం కోసం 2.90 ఎకరాలను క్రీడల శాఖ స్పోర్ట్స్ అథారిటీకి అప్పగించారు. ప్రస్తుతం స్పోర్ట్స్ అథారిటీ ఆధీనంలో ఉన్న ఈ స్థలాన్ని తిరిగి మున్సిపాలిటీ స్వాధీనం చేసుకుంటూ కౌన్సిల్ సమావేశంలో తీర్మానాన్ని ఆమోదించారు. కాగా నూనెపల్లెలోని మటన్ మార్కెట్ దుకాణం, ఎన్టీఆర్ కాంప్లెక్స్‌లోని మూడు దుకాణాలకు అద్దె బహిరంగ వేలంకు పిలిచిన ప్రకటనను కూడా కౌన్సిల్ రద్దు చేసింది. టీడీపీ కౌన్సిలర్ శ్రీదేవి, వైసీపీ కౌన్సిలర్లు సమ్మద్, కృష్ణమోహన్ మాట్లాడుతూ అద్దె ధర నిర్ణయంపై గందరగోళం ఉందని, రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల మున్సిపల్ మార్కెట్ వేలం పాట నిర్వహించి 7 నెలల కాలానికి గేటు వసూళ్ల టెండర్‌ను రద్దు చేస్తున్నట్లు కౌన్సిల్‌లో తీర్మానించారు. కమిషనర్ నిరంజన్‌రెడ్డి, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మకాలు నిలిపివేత

వెలుగోడు, ఆగస్టు 31: కాల పరిమితి దాటిన పురుగు మందుల అమ్మకాలను నిలుపుదల చేసినట్లు ఏవో పవన్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన జవారి హబ్ లిమిటెడ్ దుకాణంలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో యూనివర్సల్ ఆగ్రో కెమికల్ ఇండస్ట్రీస్ వారి కాల పరిమితి అయిపోయిన ఉత్పత్తులు 1150 కేజీల అమ్మకాలు నిలుపుదల చేసినట్లు వివరించారు. వీటి విలువ రూ.11.45 లక్షలు ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీఈవో రామకృష్ణ వెంకటశివ పాల్గొన్నారు.

ఘనంగా గౌరు జన్మదినం



పాణ్యం సీహెచ్‌సీలో పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న నాయకులు



గౌరు వెంకట్‌రెడ్డిని సన్మానిస్తున్న టీడీపీ గడివేముల నాయకులు

పాణ్యం, ఆగస్టు 31: టీడీపీ నాయకుడు గౌరు వెంకటరెడ్డి జన్మదిన సందర్భంగా శనివారం పాణ్యం సామాజిక ఆరోగ్య కేంద్రంలో ముస్లిం, మైనార్టీ జిల్లా నాయకుడు ఖాదర్‌బాషా ఆధ్వర్యంలో బాలింతలు, గర్భిణులు, రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం ప్రజల వైద్య, ఆరోగ్యం పట్ల ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఆసుపత్రుల్లో రోగులకు తగిన సౌకర్యాలు కల్పిస్తోందని అన్నారు. పాణ్యంలో 30 పడకల ఆసుపత్రిలో మరింత మెరుగైన సౌకర్యాలు, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామన్నారు. వైద్యాధికారి డాక్టర్ రహేలా, డాక్టర్ మునిస్వామి, డాక్టర్ చంద్రప్రకాష్, హెడ్ నర్స్ కళావతి, టీడీపీ నాయకులు మహబూబ్‌బాషా, గుజ్జుల సుబ్బయ్య కృష్ణ, ప్రభాకర్, గోల్డ్ సుబ్బయ్య, స్టాఫ్‌నర్స్ శైలజ, వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

గడివేముల: టీడీపీ సీనియర్ నాయకుడు, నందికొట్కూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకట్‌రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి టీడీపీ కార్యకర్తలకు పంచి పెట్టారు. అనంతరం టీడీపీ మండల అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, పాణ్యం నియోజకవర్గ టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు కృష్ణయాదవ్, శ్రీనివాసయాదవ్, మురళీమోహన్‌రెడ్డి, హర్షవర్ధన్ తదితరులు గౌరు వెంకట్‌రెడ్డిని కలిసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్

నంద్యాల కల్చరల్, ఆగస్టు 31: భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు, ప్రజలు, అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాజకుమారి సూచించారు. నదీతీర ప్రాంతాలు, లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షాలకారణంగా తాగునీరు, ఆహారం కలుషితం కాకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఉధృతంగా ప్రవ హిస్తున్న కాలువలు, వంకలు, వాగులు, దాటవద్దు. పశువులను కూడా దాటించవద్దని సూచించారు. ఏమైనా ఇబ్బందులు వస్తే కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబరు 08514-293903కు తెలియజేయాలన్నారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

'పంట నమోదును పూర్తి చేయాలి'

పంట నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ రాజకుమారి వ్యవసా అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని చాంబర్‌లో పంట నమోదుపై జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ తో కలిసి జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వ్యవసాయ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా, మండల వ్యవసాయాధికారులు తదితరులు పాల్గొన్నారు.

'వైద్యవృత్తికే వన్నె తెచ్చిన సీహెచ్‌వో బాలకృష్ణ'



బాలకృష్ణను సన్మానిస్తున్న వైద్యులు, సిబ్బంది

కొత్తపల్లి, ఆగస్టు 31: క్రమశిక్షణకు మారుపేరైన సీహెచ్‌వో బాలకృష్ణ వైద్యరంగంలో అపార అనుభవం పొంది ఆ వృత్తికే వన్నె తెచ్చారని ముఖ్య అతిథిగా హాజరైన స్టేట్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మలేరియా అధికారి రామ నాథం అన్నారు. శనివారం కొత్తపల్లిలో వెన్నెల గార్డెన్‌లో స్థానిక పీహెచ్‌సీలో సీహెచ్‌వో బాలకృష్ణ పదవీ విరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ కాంతరావు, జిల్లా మలేరియా అధికారి లక్ష్మణ్, జడ్పీటీసీ సోముల సుధాకర్ రెడ్డి, వైద్యులు దీపా నాగవేణి, మహ్మద్ బేగ్, జగదీష్, వినోద్, విశ్వేశ్వరరెడ్డి, మంజూషా, చంద్రారెడ్డి, విజయేంద్ర, జబీర్, జుబేదా, పవన్, నాగమహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

రామాంజనేయులు శేష జీవితం సుఖ సంతోషాలతో సాగాలి: ఎస్పీ



ఏఎస్ఐ రామాంజనేయులు దంపతులను సన్మానిస్తున్న ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా తదితరులు

నంద్యాల క్రైం, ఆగస్టు 31: పోలీస్ శాఖలో దాదాపు 40సంవత్సరాలు పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన ఏఎస్సై రామాంజనేయులు శేష జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆకాంక్షించారు. ఫ్యాక్షన్ జోన్ ఏఎస్సై రామాంజనేయులు ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ మాట్లాడుతూ రామాంజనేయులు అంకిత భావంతో విధులు నిర్వర్తిస్తూ క్రమశిక్షణతో ఎక్కడా రాజీ పడకుండా ఉద్యోగబాధ్యతలు నిర్వహించారన్నారు. స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సంతోష్, ఎస్బీ సీఐ ఏరిషవాలి, డీసీఆర్బీ సీఐ జయరాములు, సైబర్ సెల్, సీఐ ప్రియతమరెడ్డి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు మంజునాథ్, శ్రీనివాసులు, సబ్ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ మద్యం స్వాధీనం

నందికొట్కూరు రూరల్, ఆగస్టు 31: అక్రమంగా తరలిస్తున్న తెలంగాణ మద్యాన్ని శనివారం బ్రాహ్మణకొట్కూరు పోలీసులు పట్టుకు న్నారు. ఎస్ఐ తిరుపాలు తెలిపిన వివరాలివీ.. తెలంగాణ రాష్ట్రం జిల్లెల పాడు గ్రామానికి చెందిన నరసింహులు అనే వ్యక్తి 96 మద్యం బాటిళ్లను ఏపీలోకి అక్రమంగా తరలిస్తుండగా నందికొట్కూరు మండలం శాతనకోట గ్రామం కేసీ కెనాల్ కట్టపై పోలీసులు పట్టుకున్నారు. అతడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపుతున్నట్లు తెలిపారు. ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశామని చెప్పారు. బ్రాహ్మణకొట్కూరు పోలీస్ సిబ్బంది ఉన్నారు.

అతిసార బాధితులకు పరామర్శ

పాములపాడు, ఆగస్టు 31: వేంపెంట గ్రామంలో సచివాలయంలో డయేరియా బారిన పడి చికిత్స పొందుతున్న బాధితులను వివరాలు అడిగి తెలుసుకొన్నారు. డయేరియా బారిన చనిపోయిన బోయ లక్ష్మీదేవి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. డయేరియా కేసులు పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులకు సూచించారు. అలాగే పాములపాడు వైద్యశాలను ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి తనిఖీ చేశారు. ఇటీవల వైద్యశాలలో శిశువు వరణించిన ఘటనపై ఆమె స్పందించారు వైద్యుల పర్యవేక్షణలో కాన్పులు చేయాల్సి ఉండగా వారు లేకుండానే నర్సులు కాన్పు చేయడంపై విస్మయం వ్యక్త చేశారు. వైద్యులు లేకుంటే అదనంగా డాక్టర్లను నియమించుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని తెలిపారు. నియోజకవర్గంలో మహిళలు ఎవ్వరూ ఇబ్బందులు పడరాదని, డాక్టర్లు లేకుంటే చెప్పండి నేను డాక్టర్‌నే కాన్పులు చేస్తానని ఎంపీ బైరెడ్డి శబరి అన్నారు. వైద్యులు నాగలక్ష్మి, గులాబ్‌షా ఉన్నారు.

● వేంపెంట గ్రామంలో డయేరియాతో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. వైద్య సేవలు, మందుల నిల్వలపై ఆరా తీశారు. బాధితులకు సత్వరమే వైద్యం అందించాలని 108 వాహనలను అందుబాటులో ఉంచుకోవాలని అత్యవసర చికిత్స కోసం ఆత్మకూరు, నంద్యాల, కర్నూలుకు తరలించాలని వైద్యులకు సూచించారు. మాజీ సర్పంచ్ సుబ్బమ్మ కుమారుడు టేకూరు నాగేశ్వరరావు వైద్యులకు రూ.20 వేలు విలువ చేసే మందులు ఉచితంగా అందించడంతో ఎమ్మెల్యే అభినందించారు. గ్రామానికి 90వేల లీటర్ల నీటి సామర్థ్యం గల నీటి ట్యాంక్ నిర్మాణానికి తక్షణమే చర్యలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. డయేరియాతో మృతిచెందిన బోయ లక్ష్మిదేవి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5 వేల నగదును అందించారు. సర్పంచ్ ఆధ్వర్యంలో ఇంటింటికి మినరల్ వాటర్‌ను అందిస్తున్నట్లు తెలిపారు.

'పంటలను కాపాడాలి'

ఆత్మకూరురూరల్, ఆగస్టు 31: రైతులు సాగు చేసిన పంటలపై అడవి పందుల బెడద అధికమైందని, అధికారులు చర్యలు చేపట్టి రైతులు నష్టపోకుండా చర్యలు చేపట్టాలని కురుకుంద ఎంపీటీసీ అబ్దుల్‌కలాం అధికారులను కోరారు. శనివారం ఆత్మకూరు మండల ప్రజాపరిషత్ సమావేశ భవనంలో వైస్ ఎంపీపీ లక్ష్మీదేవి అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. అనంతరం కొంత మంది ఎంపీటీసీలు, సర్పంచ్‌లు గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టి సీజన్ వ్యాధులు ప్రబలకుండా చూడాలన్నారు. ఎంఈవో సురేష్, ఏవో విష్ణువర్ధన్‌రెడ్డి, హార్టికల్చర్ ఏవో చందన, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సువర్చల, పీఆర్ ఏఈ వెంకట సుబ్బయ్య, వెలుగు ఏపీఎం ఉమామహేశ్వరి, ఏపీవో నాగమ్మ, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నందీశ్వరుడికి పూజలు



నందీశ్వరుడికి పూజలు చేస్తున్న వేదపండితులు

మహానంది, ఆగస్టు 31: మహానంది క్షేత్రంలో శ్రావణ బహుళ త్రయోదశి పురస్కరించుకొని శనివారం సాయంకాలం నందీశ్వరుడికి ప్రదోషకాల పూజలను వేదపండితులు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన ఆలయంలోని రాతి నందీశ్వరుడికి విశేష ద్రవ్యాలతో అభిషేకపూజలతో పాటు ధూప దీప నైవేద్యాలను సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

రైతులు జాగ్రత్తలు పాటించాలి



ధర్మవరంలో పంటలను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారి

డోన్(రూరల్), ఆగస్టు 31: వర్షాలకు రైతులు జాగ్రత్తలు పాటించాలని ఉద్యానశాఖ అధికారి జి. కళ్యాణి అన్నారు. శనివారం మండలంలోని ధర్మవరం గ్రామంలో టమోటా, ఉల్లి, చామంతి పంట పొలాలను ఆమె పరిశీలించారు. పంట పొలాల్లో వర్షం నీరు నిల్వ లేకుండా రైతులు చూసుకోవాలన్నారు. పంట పొలాల నుంచి వర్షం నీరు బయటకు వెళ్లేలా జాగ్రత్తలు తీసుకుని పంటలు కాపాడుకోవాలని సూచించారు. పంటలకు నష్టం జరగకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. శనివారం మండలంలో 22 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు మండల వ్యవసాయాధికారి అబ్దుల్ షఫీ తెలిపారు.

కస్తూర్బా పాఠశాల తనిఖీ



కేజీబీవీ ఎస్‌వో లక్ష్మీసరోజతో మాట్లాడుతున్న అధికారులు

కొలిమిగుండ్ల, ఆగస్టు 31 : కొలిమిగుండ్లలోని కస్తూర్బా పాఠశాలను జిల్లా పరిశ్రమల శాఖ అధికారి, మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్ యాదవ్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేజీబీవీ రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం పాఠశాల పరిస్థితుల గురించి ఎస్‌వో లక్ష్మీసరోజను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాదరెడ్డి పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి : విద్యుత్ శాఖ ఏఈ

అవుకు, ఆగస్టు 31: వర్షాకాలంలో విద్యుత్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏఈ పక్కీరయ్య శనివారం అన్నారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలకు గురికాకుండా ప్రజలు పలు జాగ్రత్తలు పాటించాలన్నారు. తడిసిన కరెంటు స్తంభాలను పట్టుకోవటం, తడిసిన చేతులతో స్టార్టర్లు, మోటార్లు తాకటం, విద్యుత్ లైన్లకు తగులుకున్న చెట్లను తగలటం ఇళ్లలో ఉన్న కరెంటు స్విచ్ బోర్డులను తడి చేతులతో ముట్టుకోవటం చేస్తే విద్యుత్ ప్రమాదాల బారిన పడతారన్నారు. కరెంటు లైన్ల కింద నిలబడి సెల్‌ఫోన్‌లు మాట్లాడకూడదన్నారు. ఇంట్లోకి వచ్చే సర్వీసు వైరు డ్యామేజ్ అయితే విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు.

ప్రజలను అప్రమత్తం చేయండి

సంజామల, ఆగస్టు 31: భారీ వర్షాల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని తహసీల్దార్ అనిల్ కుమార్ వీఆర్వోలకు సూచించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. సెప్టెంబరు 3 వరకు భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని, మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల వీఆర్వోలు ప్రజలను అప్రమత్తం చేయాలని అన్నారు. పురాతన మట్టిమిద్దెలో నివాసం ఉన్న వారిని సురక్షిత ప్రాంతానికి తరలించాలన్నారు. విద్యుత్ స్తంభాల వద్ద ఉండరాదని, శిథిలావస్థలో ఉన్న సంక్షేమ హాస్టళ్లు, పాఠశాల భవనాల కింద విద్యార్థులు ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నదీ పరివాహక లోతట్టు ప్రాంతాల్లో ప్రజలు వెళ్లకుండా అప్రమత్తం చేయాలన్నారు. ప్రజలు కూడా అవసరమైతే తప్ప బయటికి వెళ్లరాదని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎరుకలయ్య, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

పశు బీమాను సద్వినియోగం చేసుకోండి

కోవెలకుంట్ల, ఆగస్టు 31: రైతులు పశు బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆళ్లగడ్డ డిప్యూటీ ఏడీ రమణయ్య అన్నారు. శుక్రవారం కోవెలకుంట్ల పట్టణంలోని పశువైద్య కార్యాలయంలో కోవెలకుంట్ల, గోస్పాడు మండలాలకు చెందిన సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో డిప్యూటీ ఏడీ రమణయ్య మాట్లాడుతూ పశువులకు సీజనల్ వ్యాధులు రాకుండా వాక్సిన్ వేయించుకోవాలన్నారు. పశువులకు బీమా చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్యులు క్రిష్ణకుమార్, విజయలక్ష్మి, ఉమాదేవి, అభిలాష్‌రెడ్డి, కిశోర్‌కుమారెడ్డి పాల్గొన్నారు. అనంతరం సాంబవరం పశువైద్య అటెండరు లక్ష్మీదేవి పదవీ విరమణ పొందడంతో ఆమెను సన్మానించారు.

వైభవంగా చెన్నకేశవ స్వామి పల్లకీ ఉత్సవం



చెన్నకేశవ పల్లకి వద్ద పూజలు చేస్తున్న వేద పండితులు

చాగలమర్రి, ఆగస్టు 31: మండలంలోని మల్లేవేముల గ్రామ సమీపంలోగల చెన్నకేశవ, శ్రీదేవి, భూదేవి ఉత్సవమూర్తులకు పల్లకీ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శ్రావణమాసం సందర్భంగా శనివారం వేద పండితులు చెన్నకేశవస్వామి పల్లకి వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలోని సంజీవరాయ స్వామికి మహిళలు తమలపాకులతో అభిషేకాలు చేసి పూజలు చేశారు. దాతల సహకారంతో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో నర్సయ్య, కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

మద్దిలేటి స్వామి ఆదాయం రూ.3.81 లక్షలు

బేతంచెర్ల, ఆగస్టు 31: మండలంలోని ఆర్‌ఎస్ రంగాపురంలో వెలసిన మద్దిలేటి నరసింహస్వామి క్షేత్ర ఆదాయం రూ.3.81 లక్షలు సమకూరినట్లు ఉప కమిషనర్, ఆలయ నిర్వహణాధికారి రామాంజనేయులు శనివారం తెలిపారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు ఉమ్మడి జిల్లాల నుంచే గాక ఇతర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. భక్తులు వేకువజాము నుంచే స్వామి అమ్మవార్లకు అభిషేకాలు, గండా దీపాలు, పూజలు చేసి పుట్టు వెంట్రుకలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా స్వామి సేవా టికెట్లు, లడ్డూ ప్రసాదం, కేశఖండన, రూము బాడుగలు, లీజుల వసూళ్ల ద్వారా రూ.3,81,411ల ఆదాయం లభించినట్లు ఆయన తెలిపారు.

ఆరు వేల హెక్టార్లలో పంటల సాగు

బనగానపల్లె, ఆగస్టు 31 : బనగానపల్లె మండలంలో బోర్ల కింద వరి పంటను రైతులు సాగు చేస్తున్నారు. 800 హెక్టార్లలో వరి రైతులు సాగు చేశారు. ఇంకా 2000 హెక్టార్లలో వరి పంటను సాగు చేయనున్నట్లు అంచనా వేసినట్లు ఏవో సుబ్బారెడ్డి తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో వాతావరణం అనుకూలించకపోవడంతో ఆరు వేల హెక్టార్లలో మాత్రమే వివిధ పంటలను రైతులు సాగు చేశారు. ఇంకా 5200 హెక్టార్లలో ఖరీఫ్ సీజన్‌లో జొన్న, కంది, సన్‌ఫ్లవర్, పొగాకు, మిరప తదితర పంటలు సాగు చేయాల్సి ఉంది. ప్రస్తుతం వర్షం కురుస్తుండడం, బోర్లలో భూగర్భ నీరు పెరగడంతో బోర్ల కింద వరి నాట్లు జోరుగా సాగుతున్నాయి. వర్షం గత వారం రోజులుగా కురుస్తుండడం, ఎస్సార్బీసీ నీటిని విడుదల చేయడంతో రైతులు వరినాట్లు వేయడంతో బిజీబిజీగా ఉన్నారు.

వర్షంతో పంటలకు జీవం





చాగలమర్రి: మల్లేవేముల సమీపంలో మొక్కజొన్నలో నిలిచిన వర్షపు నీరు, కోవెలకుంట్ల : వల్లంపాడు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కప్పలవాగు



నేలంపాడులో కూలిన మట్టి మిద్దె

చాగలమర్రి, ఆగస్టు 31: మండలంలో ఎడతెరిపి లేకుండా ఓ మోస్తరు వర్షం శనివారం కురిసింది. 11.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. రాజోలి ఆనకట్ట వద్ద కుందూనది పొంగి ప్రవహించింది. కుందూలో 13 వేల క్యూసెక్కుల నీటితో ప్రవహిస్తున్నట్లు కేసీ కెనాల్ ఏఈ జమాల్ వలి తెలిపారు. రాజోలి ఆనకట్ట నుంచి కేసీ కాలువకు 700 క్యూసెక్కుల నీరు విడుదల చేశామని అన్నారు. ఆనకట్ట వద్దగల 5 గేట్లను ఎత్తి కడప జిల్లా వైపుకు వరద నీటిని విడుదల చేశామని అన్నారు. పరిసర గ్రామాల ప్రజలు, కూలీలు, రైతులు నది దాటే ప్రయత్నం చేయరాదని, అప్రమత్తంగా ఉండాలని అన్నారు. కురిసిన వర్షం ఎండుతున్న పంటలకు జీవం పోసినట్లైందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

● చాగలమర్రి మండలంలోని నేలంపాడు గ్రా మంలో వర్షానికి శనివారం మట్టిమిద్దె కూలింది. గ్రామానికి చెందిన దేవభూషణం మట్టి మిద్దె కుప్పకూలి నష్టం వాటిల్లింది. మిద్దెలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.

● వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చాగలమర్రి తహసీల్దార్ రవికుమార్ హెచ్చరించారు. శనవారం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మట్టిమిద్దెల్లో నివసించే కుటుంబాల వారు జాగ్రత్తలు పాటించాలని అన్నారు.

● **కోవెలకుంట్ల:** కోవెలకుంట్ల పట్టణంలో శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి వల్లంపాడు, లింగాల గ్రామాల మధ్య కుందూ నది పక్కనే ఉన్న కప్పలవాగు పొంగి ప్రవహించింది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. కోవెలకుంట్ల నుంచి వల్లంపాడు, లింగాల మీదుగా నంద్యాల వెళ్లే రహదారిలో రాకపోకలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న రేవనూరు ఎస్‌ఐ భూపాలుడు వల్లంపాడుకు చేరుకున్నారు. గ్రామాల్లోని పనుల నిమిత్తం వేరే ప్రాంతానికి వెళ్లవద్దని హెచ్చరించారు. సర్పంచ్ కూడా వాగు వద్దకు వచ్చి పరిశీలించి ప్రజలను అప్రమత్తం చేశారు.

● **ఆళ్లగడ్డ:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఆళ్లగడ్డ ప్రాంతంలో శనివారం తేలికపాటి వర్షం కురిసింది. గత రాత్రి నుంచి కురుస్తున్న వర్షాలతో జనజీవనం అస్తవ్యస్తమైంది. కురిసిన వర్షాలకు పంట పొలాల్లో వర్షపు నీరు నిలిచి పోవడంతో రైతులు ఆ నీటిని వెలికి తీయడానికి ఇబ్బందులు పడ్డారు.

● **రుద్రవరం:** మండలంలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం సాయంత్రం వరకు వర్షం ఏకధాటిగా కురుస్తూనే ఉంది. పంటలకు ఈ వర్షం ప్రాణం పోసినట్లయిందని రైతులు హర్షం వ్యక్తం చేశారు. వర్షంతో మొక్కజొన్న, కంది, మినుము, వేరుశనగ పంటలు కళకళలాడుతున్నాయని రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

బేతంచెర్ల: మండలంలోని వివిధ గ్రామాల్లో పట్టణంలో గత రాత్రి నుంచి జడివాన కురుస్తుండటంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈదురుగాలులతో కూడిన వర్షం పడటంతో ఇళ్లలో నుంచి బయటకు రావాలన్నా విద్యార్థులు పాఠశాలలకు వెళ్లాలన్నా జంకే పరిస్థితి నెలకొంది. గత శుక్రవారం రాత్రి 12 గంటల నుంచి ఇప్పటి వరకు సుమారు 2.60 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ రికార్డుల ద్వారా తెలుస్తోంది.

ఒక రోజు ముందే పింఛన్ల పండుగ





ఇల్లూరు కొత్తపేటలో పింఛన్ పంపిణీ చేస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, ఆళ్లగడ్డలో పంచుతున్న ఎమ్మెల్యే అఖిలప్రియ

బనగానపల్లె, ఆగస్టు 31 : బనగానపల్లె మండలంలో 12,511 మందికి పింఛన్లు పంపిణీ చేశామని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. శనివారం ఇల్లూరుకొత్తపేటలో ఆయన పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇల్లూరుకొత్తపేట తనకు మంచి మెజార్టీ ఇచ్చిందని, గ్రామాన్ని దత్తత తీసుకొని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగరాజు, పీఆర్ డీఈ నాగశ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ సాయికృష్ణ, ఆర్‌అండ్‌బీ డీఈ సునీల్‌కుమార్‌రెడ్డి, ఏఈ హుసేన్, హౌసింగ్ డీఈ కృష్ణారెడ్డి, ఏపీఎం తిరుపాల్‌రెడ్డి, ఏపీవో హరికృష్ణ పాల్గొన్నారు.

● **ఆళ్లగడ్డ:** పింఛన్ పంపిణీ విజయవంతం చేశామని ఎమ్మెల్యే అఖిలప్రియ తెలిపారు. ఆళ్లగడ్డ పట్టణంలోని గాయత్రి దేవాయలం వద్ద శనివారం ఆమె పింఛన్లను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రధానంగా ఎన్నికల సమయంలో చెప్పిన హామీ మేరకు వెయ్యి రూపాయలు పెంచి ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ వెంకటరామిరెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

● **కొలిమిగుండ్ల:** ఒక రోజు ముందుగానే గ్రామాల్లో పింఛన్ పంపిణీ పండుగలా కొనసాగింది. మండలంలో మొత్తం 7103 పింఛన్లు ఉండగా సుమారు 6,700 పింఛన్లు పంపిణీ చేసి 95 శాతం పూర్తి చేసినట్లు ఎంపీడీవో ప్రసాదరెడ్డి తెలిపారు. మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస యాదవ్ పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త వీఆర్ లక్ష్మీరెడ్డి, కనకాద్రిపల్లె సర్పంచ్ శివశంకర్, వెంకటమల్లారెడ్డి, రామిరెడ్డి, పెద్దిరెడ్డి, పెద్ద వెంకటేష్ పాల్గొన్నారు.

శిరివెళ్ల: అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయమని డ్వామా పీడీ రామచంద్రారెడ్డి అన్నారు. మండంలోని మోత్కలపల్లెలో ఎంపీడీవో కేవీ సుబ్రమణ్యం, సర్పంచ్ భూమా వెంకట వేణుగోపాల్‌రెడ్డితో కలిసి పింఛన్లు శనివారం పంపిణీ చేశారు.

● **అవుకు:** ప్రభుత్వం లబ్ధిదారులకు ఒక రోజు ముందే పింఛన్లను అందించినట్లు ఎంపీడీవో వెంకటేశ్వరరెడ్డి శనివారం తెలిపారు. ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలో 6,768 మంది లబ్ధిదారుల ఉండగా 6,405 మందికి పింఛన్‌లను అందించామన్నారు. మిగిలిన 363 మందికి 2వ తేదీన అందిస్తామని తెలిపారు.

● **క్రిష్ణగిరి:** జోరు వర్షంలోనూ అధికారులు సామాజిక భద్రత పింఛన్లు పంపిణీ చేశారు. శనివారం అన్ని గ్రామాల్లో ఉదయం 6గంటల నుంచే పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని సచివాలయ అధికారులు చేపట్టారు. ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు పింఛన్ డబ్బులు అందించారు.

● **డోన్(రూరల్):** ఒకటో తేదీకి ఒక రోజు ముందుగానే పింఛన్లు అందజేసిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు దక్కుతుందని వెంకటనాయునిపల్లె సర్పంచ్ సీలం చంద్రశేఖర్ నాయుడు అన్నారు. శనివారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ ఒకటో తేదీ అందజేయాల్సిన పింఛన్లను ఈ నెల 31వ తేదీ అందజేసి ప్రజల మన్ననలు పొందారన్నారు.

● **కోవెలకుంట్ల:** పట్టణంలోని సంతపేటలో పింఛన్ల రాష్ట్ర టీడీపీ కార్యదర్శి గడ్డం రామక్రిష్ణారెడ్డి పింఛన్లు పంపిణీ చేశారు. ఒక రోజు ముందుగానే పింఛను పంపిణీ చేసి ప్రభుత్వం పండుగ వాతావరణం సృష్టించిందని అన్నారు. ఈ ఘనత సీఎం చంద్రబాబునాయుడుకే దక్కిందని ఆయన అన్నారు.

● **దొర్నిపాడు:** మండలంలోని ఆయా గ్రామాల్లో ఎన్టీఆర్ భరోసా పింఛన్‌ల కార్యక్రమం 92 శాతం పంపిణీ చేసినట్లు ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు. డబ్ల్యూ కొత్తపల్లెలో, డబ్ల్యూ గోవింద్‌నాయక్ పింఛన్ పంపిణీ కార్యక మానికి జిల్లా ప్రత్యేక అధికారి గోవిద్‌నాయక్ హాజరయ్యారు. కార్యక్రమాల్లో మండల మాజీ అధ్యక్షుడు భూమా బ్రహ్మానందరెడ్డి, మల్లేశ్వర చౌదరి, సురేంద్ర, వెంకటస్వామి, వెంకట్‌నాయుడు, కాశీవిశ్వనాథ్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, వివిధ గ్రామాల సర్పంచ్‌లు ఉన్నారు.

● **చాగలమర్రి:** చాగలమర్రిలోని గుంతపాలెం, న్యూబిల్డింగ్ వీధిలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ చేశారు. మండలంలో 98 శాతం పింఛన్ పంపిణీ పూర్తయినట్లు ఎంపీడీవో మహబూబ్‌దౌల తెలిపారు. టీడీపీ నాయకులు అజిముద్దీన్, జెట్టి నాగరాజు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తి నరసింహులు, నాగూర్‌వలి, రాజేంద్ర, రాజేష్, బషీర్ పాల్గొన్నారు.

● **రుద్రవరం:** మండలంలో 6313 మంది పింఛన్‌దారులు ఉండగా, 6011 మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు మండల ప్రత్యేక అధికారి నాగరాజు తెలిపారు. ముత్తలూరు, నరసాపురం గ్రామాల్లో పర్యటించి పింఛన్ల పంపిణీ సరళిని పరిశీలించారు. ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి, ఏఈ వెంకటరాముడు పాల్గొన్నారు.

● **సంజామల:** ఒక రోజు ముందే పింఛన్లు పంపిణీ చేసినట్లు టీడీపీ మండల ఇన్‌చార్జి బత్తుల ప్రతాప్ రెడ్డి, ముక్కమళ్ల టీడీపీ యువ నాయకుడు మూసాని చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. శనివారం ముక్కమళ్ల, గిద్దలూరు గ్రామాల్లో వారి ఇంటింటికి తిరిగి పింఛన్లు పంపిణీ చేశారు. చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం ఎన్‌టీఆర్ భరోసా కింద నెలకు రూ.4 వేలు పింఛన్ అందించడం హర్షించదగ్గ విషయమన్నారు.

సంజామల: మండలలో 95 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో విజయ్ కుమార్ రెడ్డి తెలిపారు. మండల వ్యాప్తంగా 5,230 మంది పింఛన్‌దారులు ఉండగా 4,900 మందికి పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. మిగిలిన వారికి సోమవారం అందజేస్తామని చెప్పారు.

డోన్: సీఎం చంద్రబాబు చిత్తశుద్ధితో పేదల సంక్షేమానికి పాటు పడుతున్నారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ అన్నారు. శనివారం మండలంలోని ఎద్దుపెంట గ్రామంలో మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్‌తో కలిసి పింఛన్లు పంపిణీ చేశారు.

బేతంచెర్ల: మండలంలో మొత్తం 6140 పింఛన్లకుగాను 5838 పంపిణీ చేశారు. పట్టణంలోని రెండో వార్డు శేషారెడ్డి నగర్‌లో టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి రవీంద్ర నాయక్ ఆధ్వర్యంలో పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎల్లనాగయ్య, పోలూరు రాఘవరావు, చంద్రశేఖర్, షేక్షావలి చౌదరి, వెంకటేశ్వర ఆచారి, ప్రకాష్, రహంతుల్లా, మండ్లవానిపల్లె మధు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతపై కేసు కొట్టివేత

డోన్, ఆగస్టు 31: డోన్ మండలంలోని వెంకటనాయునిపల్లెకు చెంది న టీడీపీ సీనియర్ నాయకుడు సీలం భాస్కర్‌నాయుడుపై నమోదైన కేసును కొట్టి వేస్తూ డోన్ సబ్ కోర్టు జడ్జి తీర్పు చెప్పారు. శుక్రవారం డోన్ సబ్‌కోర్టులో జడ్జి తంగమణి ఈ కేసును విచారించిన తర్వాత తీర్పు ఇచ్చారు. శనివారం కర్నూలులోని కోట్ల నివాసంలో ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని భాస్కర్ నాయుడు కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

మెట్టుపల్లిలో కృష్ణుడి గ్రామోత్సవం

ప్యాపిలి, ఆగస్టు 31: మండలంలోని మెట్టుపల్లి గ్రామంలో శనివారం కృష్ణుడి విగ్రహం గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రబోధానంద స్వామి సేవా సమితి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు కృష్ణ, మల్లేశ్వరయ్య, శివశంకర్, మనోహర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

● **కోవెలకుంట్ల:** పట్టణంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవ సమితి హిందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో శనివారం శ్రీకృష్ణుడి గ్రామోత్సవం నిర్వహించారు. కోవెలకుంట్ల పట్టణ అధ్యక్షుడు జనార్దన్ అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. ముందుగా పట్టణ ఉప సర్పంచ్ సూర్యనారాయణరెడ్డి ఇంటి ముందు నుంచి పట్టణంలోని ప్రధాన వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు.

ఆలయ అభివృద్ధికి దాతల కృషి

కొలిమిగుండ్ల, ఆగస్టు 31: మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కోరుమానుపల్లె గుండం ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి పలువురు దాతలు తమవంతు కృషి చేస్తున్నారు. తాజాగా తాడిప్రతికి చెందిన దాత అంకిరెడ్డి రూ.70 వేలతో స్టీల్ పైపులతో క్యూలైన్ ఏర్పాటు చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

చాగలమర్రి, ఆగస్టు 31: చాగలమర్రిలోని పాతబస్టాండు వీధికి చెందిన టీడీపీ నాయకుడు గడేకారి మహమ్మద్ కుమారుడు సిద్ధిక్ (25) శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. సిద్ధిక్ తన స్నేహితుడు చౌహిత్‌తో కలిసి ప్రొద్దుటూరుకు వెళ్లి రాత్రి సమయంలో ద్విచక్ర వాహనంలో తిరిగి చాగలమర్రికి వస్తుండగా దువ్వూరు మండలం పెద్దజొన్నవరం సమీపంలో లారీ ఢీకొన్న ఘటనలో సిద్ధిక్ అక్కడికక్కడే మృతి చెందగా చౌహిత్ గాయపడ్డాడు. చౌహిత్‌ను చికిత్స నిమిత్తం, సిద్ధిక్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు వైద్యశాలకు తరలించారు. దువ్వూరు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం చేసి కుటుంబీకులకు అప్పగించారు. టీడీపీ రాష్ట్ర మైనార్టీసెల్ ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా, టీడీపీ నాయకులు కొలిమి ఉసేన్‌వలి, షరిఫ్, మౌళాలి, అనిఫ్, ఖలీల్‌తో పాటు పలువురు సంతాపం ప్రకటించి కుటుంబానికి సానుభూతి వ్యక్తం చేశారు. టీడీపీ నాయకుడు గడేకారి మహమ్మద్ కుటుంబ సభ్యులకు మనోధైర్యం నింపి అండగా ఉంటామని అన్నారు.

మద్యం స్వాధీనం

దొర్నిపాడు, ఆగస్టు 31: మండలంలోని దొర్నిపాడు గ్రామంలో శనివారం 17 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలివీ.. దొర్నిపాడు గ్రామానికి చెందిన నాగూర్‌బాషా అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి 17 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఏఎస్‌ఐ రంగయ్య, సిబ్బంది ఉన్నారు.

వైభవంగా వరద పాయసం మహోత్సవం



వెంకటేశ్వరస్వామి సన్నిధానంలో వరద పాయసం తీసుకునేందుకు ఎగబడుతున్న భక్తులు

డోన్(రూరల్), ఆగస్టు 31: మండలంలోని ఆవులదొడ్డి కొండల్లో వెలసిన లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయ సన్నిధానంలో శనివారం వరద పాయసం మహోత్సవం వైభవంగా జరిగింది. స్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం వరద పాయసాన్ని స్వామివారి బండ గుండుపై బిందెలతో పారబోయగా పాయసం కోసం భక్తులు ఎగబడ్డారు. ఈ వరద పాయసాన్ని భక్తులు మహాప్రసాదంగా స్వీకరిస్తారు. అనంతరం పెద్ద ఎత్తున భక్తులకు గ్రామ పెద్దల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులు సుభిక్షంగా ఉండాలని, పంటలు పండి రైతులకు మంచి దిగుబడులు, లాభాలు వచ్చి సుఖసంతోషాలతో ఉండాలని కోరుతూ స్వామివారి సన్నిధానంలో గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఈ వరద పాయస మహోత్సవాన్ని ప్రతి ఏటా నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త ఆలా మోహన్ రెడ్డి తెలిపారు.

భక్తి భావం పెంచుకోవాలి



భక్తులను సత్కరిస్తున్న బ్రహ్మానందచారి తదితరులు

బనగానపల్లె, ఆగస్టు 31 : ప్రతి వ్యక్తి తమ మతాలను ఆదరించి భక్తిభావం పెంపొందించుకొని ప్రజేసేవలో పాలు పంచుకోవాలని జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మానందచారి అన్నారు. శనివారం మండలంలోని పలుకూరు గ్రామంలోని రామాలయంలో పూజారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో భక్తి భావనను పెంపొందిస్తున్న బాలహనుమంతు, వెంకటసుబ్బయ్యగౌడ్‌లను సత్కరించారు. బ్రహ్మానందచారి మాట్లాడుతూ మంచి మార్గానికి దగ్గర దారి భక్తి మార్గమన్నారు. ప్రతి వ్యక్తి తమ ఇష్ట దైవాన్ని ఒక గంట అయినా స్మరించుకోవాలన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

'మెనూ తప్పనిసరి'



చాగలమర్రి ఉర్దూ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో

చాగలమర్రి, ఆగస్టు 31: ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో మెను తప్పనిసరిగా పాటించాలని ఎంఈవో అనూరాధ వంట ఏజెన్సీలకు సూచించారు. శనివారం చాగలమర్రి ఉర్దూ పాఠశాల, ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు మాబుహుసేన్, శేషాద్రి, సీఆర్పీ అమీర్‌ఖాన్ పాల్గొన్నారు.

రామలింగేశ్వర స్వామికి పూజలు



రామలింగేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు

చాగలమర్రి, ఆగస్టు 31: చాగలమర్రిలోని రామలింగేశ్వర ఆలయంలో అభినవ శంకరానందస్వామి ఆధ్వర్యంలో శని త్రయోదశి సందర్భంగా మాస శివరాత్రి పూజలను శనివారం మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శివపార్వతులకు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు సామూహికంగా విష్ణు సహస్ర నామ పారాయణం చేశారు. అఖండ మహా మృత్యుంజయ మంత్రంతో భక్తులు పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్ సేవలు మరువలేనివి

డోన్(రూరల్), ఆగస్టు 31: డోన్ ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్‌గా నాగజాస్మిన్ అందించిన సేవలు మరువలేనివని మండల విద్యాధికారి ప్రభాకర్, ఎంఈవో-2 నరసప్పలు అన్నారు. శనివారం ఏపీ మోడల్ స్కూల్‌లో పదవీ విరమణ పొందిన ప్రిన్సిపాల్ నాగజాస్మిన్‌కు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పట్టణ సీఐ ఇంతియాజ్‌బాషా, కర్నూలు జిల్లా డీఈఈవో కార్యాలయ ఏవో శామ్యూల్ పాల్, జీసీఈవో స్నేహలతలతో పాటు వివిద మోడల్ స్కూల్స్ ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు హాజరయ్యారు.

ఉపాధ్యక్షుడిగా మహేశ్వరరెడ్డి

డోన్, ఆగస్టు 31: రాష్ట్ర విపత్తుల స్పందన, అగ్నిమాపక సేవల శాఖ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా డోన్ పట్టణానికి చెందిన మహేశ్వర రెడ్డి ఎన్నికయ్యారు. గుంటూరులో రెండు రోజుల క్రితం అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో డోన్ అగ్నిమాపక కేంద్రంలో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న మహేశ్వరరెడ్డి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా 195 ఓట్లతో విజయం సాధించినట్లు తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నిక కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు: ఎమ్మెల్యే

ఆళ్లగడ్డ, ఆగస్టు 31: ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అఖిలప్రియ అన్నారు. ఆళ్లగడ్డ ఆర్టీసీ బస్టాండులో శనివారం మంత్రాలయం క్షేత్రానికి నూతన బస్సు సర్వీసును ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో డీఎం రాజశేఖర రెడ్డి, సిబ్బంది, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

రుద్రవరం, ఆగస్టు 31: మండలంలోని వాసాపురంలో కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి లక్ష్మీగోదాదేవి అమ్మవారు మానస లింగేశ్వరస్వామి, త్రిపుర సుందరీదేవి అమ్మవార్లకు శనివారం అర్చకులు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు.

నరసింహ స్వామి ఆలయాల్లో..

మండలంలోని నరసాపురం, రుద్రవరం గ్రామాల్లో కొలువుదీరిన నరసింహ స్వామి ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు తీర్థ ప్రసాదాలను పంచిపెట్టారు.